ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 82 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 28 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 82 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 28 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేశాం...

### దళారులను నమ్మి మోసోవద్దు

- రాష్ట్రంలో ఇప్పటివరకు 8.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లోకి ఇప్పటికే రూ. 1713 కోట్లు జమ
- ధాన్యం కొనుగోలు చేసిన 4-6 గంటల్లోనే నగదు చెల్లింపు
- గత ప్రభుత్వ బకాయిలు రూ. 1674 కోట్లు చెల్లించిన కూటమి సర్కార్
- దళారులపై రైతులను అప్రమత్తం చేసిన మంత్రి నాదెండ్ల



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. గురువారం విజయవాడలోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నేటి వరకు 8,22,000 మెట్రిక్

వివరాలు 2లో..



# స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను...

# ఎవరినీ చేయనివ్వను

- అమరావతిలో శ్రీవారి ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన
- రూ.260 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి ప్రణాళిక
- రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని టీటీడీకి సీఎం ఆదేశం
- రాజధానికి భూములిచ్చిన రైతులకు చంద్రబాబు ధన్యవాదాలు
- గత ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి ఆటంకాలు కలిగాయని వ్యాఖ్య




పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతిలోని వెంకటపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ.260 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆలయ విస్తరణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ బృహత్తర కార్యాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజధాని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ విస్తరణ పనులను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. తొలి దశలో రూ.140 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ వంటి నిర్మాణాలు చేపడతారు. ఇక రెండో దశలో రూ.120 కోట్లతో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, భారీ అన్నదాన సముదాయం, యాత్రికుల విశ్రాంతి భవనాలు,

వివరాలు 2లో..

## బంగాళాఖాతంలో 'దిట్వా' తుపాను...

- శనివారం నాటికి దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంపై ప్రభావం చూపే సూచన
- తమిళనాడులో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక
- ప్రధాన పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ.. మత్స్యకారులు అప్రమత్తం



పెన్ పవర్ డెస్క్:నైరుతి బంగాళాఖాతంలో, శ్రీలంక తీరానికి సమీపంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ గురువారం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది గురువారం సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

వివరాలు 2లో..

## శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు... టీటీడీపై సీఎం చంద్రబాబు సమీక్ష



- నలుదిశలా తిరుమల ఆధ్యాత్మిక వైభవాన్ని చాటాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో తిరుమల తరహా విధానాలు అమలు చేయాలని సూచన
- వైద్య నిపుణులను శ్రీవారి సేవకులుగా ఆహ్వానించి సేవలు వినియోగించుకోవాలని దిశానిర్దేశం
- వైకుంఠ ఏకాదశికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని టీటీడీకి స్పష్టం
- పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ, కొత్త ఆలయాల నిర్మాణంపై ప్రత్యేక ప్రణాళిక

వివరాలు 2లో..

## ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే



- ఆన్‌లైన్ కంటెంట్‌కు జవాబుదారీతనం తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు
- సొంత ఛానల్ ఉందని బాధ్యతారాహిత్యంగా ఉండటం సరికాదని కీలక వ్యాఖ్యలు
- యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా వివాదంపై విచారణ
- వినియోగదారుల కంటెంట్ నియంత్రణపై కేంద్రానికి ఆదేశాలు
- నిబంధనల రూపకల్పనకు నాలుగు వారాల గడువు

వివరాలు 2లో..

## పవన్ కల్యాణ్‌వి తెలివితక్కువ మాటలు



- కోనసీమకు తెలంగాణ నేతల దిష్టి తగిలిందన్న పవన్ కల్యాణ్
- పవన్‌వి తెలివితక్కువ మాటలంటూ జగదీష్ రెడ్డి కౌంటర్
- మా దిష్టి కాదు, ఏపీ వాళ్ల దిష్టే హైదరాబాద్‌కు తగిలిందన్న జగదీశ్
- మెదడు వాడకుండా మాట్లాడేవాళ్లు డిప్యూటీ సీఎంలయ్యారంటూ విమర్శ
- రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపిన 'దిష్టి' వ్యాఖ్యలు

వివరాలు 2లో..

## ప్రపంచానికే ఆదర్శం మన యువత..

## వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది

- భారత జెన్-జెడ్ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు
- వారి ఆత్మవిశ్వాసం ప్రపంచానికే ఆదర్శమన్న ప్రధాని
- అంతరిక్ష రంగంలో 300కు పైగా స్టార్టప్‌ల ఏర్పాటు
- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌లతో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- యాప్‌ల నుంచి డీప్-టెక్ వైపు యువత అడుగులు

పెన్ పవర్ డెస్క్:భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-I'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా

వివరాలు 2లో..



## మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు

- మంగళగిరిలో నూర్ మసీద్‌ను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- మతం కంటే మానవత్వమే గొప్పదని కీలక వ్యాఖ్యలు
- భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపు
- రాష్ట్ర, దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచన



పెన్ పవర్ డెస్క్:మతం ఏదైనా మానవత్వాన్ని ఎన్నడూ మరవకూడదని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువత భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన

వివరాలు 2లో..

## స్వామివారి విషయంలో ఏ తప్పు చేయలేదు..

## పాలీగ్రాఫ్ టెస్టుకు నేను సిద్ధం

- శ్రీవారి లడ్డూ నెయ్యి వివాదంపై స్పందించిన వైవీ సుబ్బారెడ్డి
- పాలీగ్రాఫ్ పరీక్షకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టీకరణ
- ఆలయాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపణ
- సిట్ దర్యాప్తు జరుగుతుండగా తప్పుడు ప్రచారం తగదని మీడియాకు హితవు

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# అమరావతికి చట్టబద్ధతుఅనిశ్చితి నుండి భవిష్యత్తు నిర్మాణంకు

అమరావతి రాజధాని ప్రశ్న ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఎంతకాలం వెంటాడిందో చెప్పడం కష్టం. రాజకీయాల అస్తవ్యస్త గమనంలో, ప్రజల ఆశలుఆందోళనలుఅసహనాలు అనిశ్చితి అన్నీ కలిసిపోయి ఒక భావోద్వేగ తుఫానుగా మారిన విషయం అందరికీ తెలిసిందే. రాజధాని అంటే కేవలం ఒక ప్రదేశం కాదుబీ అది ఆ రాష్ట్ర పునర్నిర్మాణ యాత్రకు తొలి అడుగు, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక, భవిష్యత్ తరాలకు ఇచ్చే హామీ. ఈ నేపథ్యంలో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు చేపట్టిన చర్యలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లోకంలో కొత్త వెలుగుదీపంలా మెరవడం సహజం.

**అయోమయానికి తెరదించే చట్టబద్ధత**

డిసెంబర్ పార్లమెంటు సమావేశాల్లో "అమరావతి రాజధాని బిల్లు" ప్రవేశపెట్టబడబోతున్నది అన్న సంకేతాలు రాష్ట్రవ్యాప్తంగా ఆశ కిరణాలను విస్తరించాయి. ఎన్నేళ్లుగా కొనసాగుతున్న అనిశ్చితి వాతావరణయపెట్టుబడిదారుల్లో అభద్రతురైతుల్లో భయయప్రజల్లో కలత ఇవన్నీ చట్టపరమైన రక్షణ రూపంలో తొలగిపోయే అవకాశం కనిపిస్తోంది. శాశ్వత రాజధాని చట్టబద్ధత పొందడం అనేది కేవలం పరిపాలనా నిర్ణయం కాదుబీ అది ప్రజల మనోవ్యథలకు ఓదార్పు, వారి నమ్మకానికి మళ్ళీ బలమిచ్చే రాజకీయ నీతి.

**రైతుల త్యాగాలకు గౌరవం**

అమరావతి పేరును ప్రస్తావించినప్పుడు తొలి గుర్తుకు వచ్చేది రైతులే. తమ భూములను వ్యక్తిగత ఆస్తిగా కాక, రాష్ట్ర నిర్మాణానికి పునాది రాయిగా సమర్పించిన వారు ఏం అనుభవించారో ఆకాశానికే తెలుసు. మూడు రాజధానుల ప్రతిపాదన వారి త్యాగాలను ప్రశ్నార్థకంలో నిలబెట్టి, ఆశల్ని మబ్బులా చుట్టేసింది. అయినా వారు వెనుకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యంలో "అధికారమే కాదుఅధికారం తీసుకునే నీతీ ఉండాలి" అనే భావాన్ని

**వారి పోరాటం గుర్తు చేసింది.**

అమరావతి బిల్లుతో కేంద్రం వారి త్యాగాలకు చట్టరూపం ఇస్తోంది. ఇది రైతుల విజయమే కాదుబీ రాష్ట్ర ఆత్మ విశ్వాసం తిరిగి పుట్టుకొస్తున్న క్షణం.

**రాజకీయ స్థిరత్వానికి చట్టమే బలమైన అండ**

గత దశాబ్దం ఏపీలో పెట్టుబడులకు అత్యంత గండికొట్టిన అంశం 'రాజధాని మార్పు' అనే పదమే. దాని ప్రభావం పరిశ్రమల నుంచి విద్యాసంస్థల వరకు ప్రతి రంగాన్ని తాకింది. రాష్ట్రానికి ఎంచుకున్న దారి ఎప్పుడైనా ఒక రాజకీయ నిర్ణయంతో మారిపోతుందన్న భయం నిరుద్యోగం, పెట్టుబడుల కొరత, అవిశ్వాసయఅన్నింటికి దారితీసింది.

**ఈ నేపథ్యంలో అమరావతికి చట్టబద్ధత ఇవ్వడం అనేది:**

- పరిపాలనకు స్థిరత్వం
- పెట్టుబడిదారులకు భరోసా
- రాష్ట్రానికి దీర్ఘకాల దృష్టి
- అభివృద్ధికి వేగం

అని చెప్పాలి.

**అరుదైన కానీ అత్యవసరమైన చట్ట గుర్తింపు**

దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ రాష్ట్ర రాజధానికీ ప్రత్యేక చట్టబద్ధ గుర్తింపు ఇవ్వలేదు. అమరావతికి ఆ గౌరవం దక్కబోతున్నది అంటే అది కేవలం రాజ్యపాలనా విషయం కాదు ఇది ప్రజాబలాన్ని, రైతుల నిబద్ధతను, రాష్ట్ర ఆత్మస్థైర్యాన్ని గుర్తించిన నిర్ణయం.

**ఇది రాజధానికి "శాశ్వత బీమా".**

ఇది భవిష్యత్తు రాజకీయాలు రాజధానిని వాడుకునే అవకాశం లేకుండా చేసే న్యాయరక్షణ.

**విమర్శలను ఎదుర్కొనే వాస్తవం**

అమరావతి చట్టబద్ధతపై కొందరు ప్రశ్నలు లేవనెత్తుతారు.
"రాష్ట్రాలకు స్వతంత్రాధికారం దెబ్బతింటుందా?"
"భవిష్యత్తులో మార్పులు అసాధ్యమవుతాయా?"
"ఇది రాజకీయ ప్రయోజనాల కోసమా?"
అయితే ఈ ప్రశ్నలన్నింటినీ మించి నిలబడేది ఒక వాస్తవయ
అమరావతి నిర్మాణం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు అవసరమైన శాశ్వత పెట్టుబడి.రాజకీయ ప్రయోగాల నష్టాలు ఏపీలో ఇప్పటికే స్పష్టంగా కనిపించాయి. ఆ ప్రయోగాల పునరావృతాన్ని నిరోధించడం ప్రజాస్వామ్య రక్షణకు తప్పనిసరి.

**కేంద్రురాష్ట్ర సమన్వయంతో పునర్జన్మ**

టిడిపి - ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం అమరావతి భవితవ్యాన్ని మళ్లీ స్థిరపరిచింది. సిఆర్డిఏ నుంచి కేంద్రానికి పంపిన వివరాలు, అటార్నీ జనరల్ నివేదిక, న్యాయశాఖ-హోం శాఖ పరిశీలనలు, క్యాబినెట్ ఆమోద ప్రక్రియఇవి అన్నీ కేంద్రం ఈ విషయంలో చూపుతున్న అత్యంత శ్రద్ధకు నిదర్శనం.

**పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన రోజు**

అది కేవలం చట్టం ఆమోదం మాత్రమే కాదు.
అది ఆంధ్రప్రదేశ్‌కు రాజకీయ స్థిరత్వం పునర్నిర్మాణం,
అమరావతి రైతుల పోరాటానికి సంఘటనాత్మక గౌరవం,
మొత్తం రాష్ట్రానికి అభివృద్ధి కొత్త అధ్యాయం.

**చివరిగా అమరావతికలల నుండి నిజ జీవితానికి సంబంధించిన అంశం**

అనిశ్చితి ఎన్నాళ్ళు ఎగసిపడినా, ఆశ అనే వెలుగు చివరికి విజయం సాధిస్తుంది.
అమరావతికి చట్టబద్ధత ఇవ్వడం ఆంధ్రప్రదేశ్‌కు కేవలం శుభవార్త కాదు.
ఇది రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టే ప్రజాస్వామ్య విజయం.
కలతను తొలగించి, కలను నిజం చేసే చారిత్రాత్మక తీర్పు.
అమరావతి ఇక వివాదం కాదు
ఎప్పటికీ నిలిచే రాజధాని.
ఇక సందిగ్ధం కాదు భవిష్యత్ తరాలకు అందే సమగ్ర హామీ.
ఈ నిర్ణయం ఒక ప్రాంతానికి మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవానికి ప్రజలకు కూడా...

# ప్రపంచానికే ఆదర్శం మన యువత.. వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది

- మొదటి పేజి తరువాయి

మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు.దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు.గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను... ఎవరినీ చేయనివ్వను

- మొదటి పేజి తరువాయి

అర్చకులు-సిబ్బంది నివాస గృహాలు, రెస్ట్ హౌస్, పరిపాలన భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, కలియుగ దైవం వేంకటేశ్వరుని ఆశీస్సులతోనే రాజధానికి అమరావతి అని పేరు పెట్టామని గుర్తు చేశారు."దేవతల రాజధాని అమరావతే మన రాజధానిగా ఉండాలని సంకల్పించాం. కృష్ణానది ఒడ్డున 25 ఎకరాల్లో 2019లోనే ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాం. కానీ గత ప్రభుత్వం విధ్వంసం తప్ప ఒక్క మంచి పని కూడా చేయలేదు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని త్యాగం చేస్తే, వారికి గత ఐదేళ్లు నరకం చూపించారు. ఆ వెంకన్ననే నమ్ముకున్న రైతులు 'న్యాయస్థానం టు దేవస్థానం' పేరుతో పాదయాత్ర చేశారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని అన్నారు.తాను శ్రీవారికి పరమ భక్తుడినని, తమ ఇంటి దైవం ఆయనేనని చంద్రబాబు తెలిపారు. "మా ఇంటి నుంచి చూస్తే శేషాచల పర్వతం కనిపిస్తుంది. చిన్నప్పటి నుంచి స్వామిని చూస్తూ పెరిగాను. స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను, ఎవరినీ చేయనివ్వను. తప్పు చేస్తే ఆయనే ఈ జన్మలో శిక్షిస్తాడు. నాడు స్వామివారి సేవకు వెళ్తుంటే నక్సలైట్లు 23 క్లైమోర్ మైన్లు పేల్చినా, ఆ స్వామి దయ వల్లే ప్రాణాలతో బయటపడ్డాను" అని నాటి ఘటనను గుర్తుచేసుకున్నారు. తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానానికి శ్రీకారం చుడితే, తాను స్విమ్స్‌లో ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించానని చెప్పారు.రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాన్ని చేపడతామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. ముంబైలో రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో స్వామి ఆలయాన్ని నిర్మిస్తోందని ఉదహరించారు. భక్తులు కూడా ఆలయ నిర్మాణాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా, సంపదతో వర్ధిల్లాలని ఆ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు సభ్యులు, రైతులు, భక్తులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు... టీటీడీపై సీఎం చంద్రబాబు సమీక్ష

ప్రపంచం నలుచెరగులా తిరుమల శ్రీవారి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు చేపట్టాలని, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్యాత్మికత, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గురువారం సచివాలయంలో దేవాదాయశాఖ, టీటీడీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుమల ఆలయంలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాలను రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రసాదాల తయారీ, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో తిరుమల ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. ప్రసాదాల తయారీకి సేంద్రియ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని, భక్తుల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వాడుకోవాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యం కావాలని, టీటీడీ భక్తుల పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు.

**టీటీడీ ఆసుపత్రులు ఆదర్శంగా నిలవాలి**

తిరుపతిలోని స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులను అనుసంధానం చేసి, వాటిని ఒక మోడల్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఆస్పత్రుల తరహాలో అత్యుత్తమ నిర్వహణ ప్రమాణాలతో వీటిని తీర్చిదిద్దాలని సూచించారు. దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులను 'శ్రీవారి సేవకులు'గా ఆహ్వానించి, వారి సేవలను ఈ ఆసుపత్రుల ద్వారా భక్తులకు, ప్రజలకు అందించేలా అవకాశం కల్పించాలన్నారు.

మందులను నేరుగా తయారీదారుల నుంచే కొనుగోలు చేయాలని, అత్యవసర సమయాల్లో క్యూలైన్లలోని భక్తులను తక్షణమే ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. భక్తులకు సులభంగా సమాచారం అందించేందుకు అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు.

**వైకుంఠ ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు**

రాబోయే వైకుంఠ ఏకాదశికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎం టీటీడీ అధికారులను ఆదేశించారు. భక్తులు అన్ని భాషల్లోనూ దర్శనానికి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించాలని, వీలైనంత ఎక్కువ మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలోని అన్ని దేవాలయాల్లో నిత్యాన్నదానం జరిగేలా చూడాలన్నారు. తిరుమల కొండలపై జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దివ్య ఔషధవనం ఏర్పాటుతో పాటు వివిధ రకాల పుష్పజాతుల మొక్కలను నాటాలని పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే

సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది.కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను వక్రీకరించకూడదని ఆయన పేర్కొన్నారు.వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియాలో వినియోగదారులు సృష్టించే కంటెంట్‌ను నియంత్రించేందుకు సరైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది.

# మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు

- మొదటి పేజి తరువాయి

పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరిలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన 'నూర్ మసీద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మస్జీద్‌ను ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "మంగళగిరి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం నాకు దక్కింది. నాకున్న శక్తి మేరకు సేవ చేస్తున్నాను. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సమాజంలో ఇంకా పేదరికం ఉంది, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు.తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, "2019లో దేవుడు నాకు ఒక కఠినమైన పరీక్ష పెట్టాడు. చాలామంది నన్ను ఎగతాళి చేశారు. కానీ, అదే దేవుడు నాకు శక్తిని, పట్టుదలని ఇచ్చాడు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే విజయం తప్పక వరిస్తుంది. కష్టాలు అందరికీ వస్తాయి, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి" అని యువతకు స్ఫూర్తినిచ్చారు. కాలం మారిందని, యువత చదువుపై దృష్టి సారించి భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. 2047 నాటికి దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా

అందరూ పనిచేయాలని లోకేశ్ కోరారు. "మెరుగైన సమాజ నిర్మాణం కోసం నైతిక విలువలు చాలా అవసరం. ముఖ్యంగా మహిళలను గౌరవించాలి. మన మధ్య విభేదాలు సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు, అలాంటి వాటికి తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలి. ప్రజలు నా పనిని గుర్తించినప్పుడే నాకు కొండంత బలం. అందరికీ అండగా ఉంటూ, కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం" అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, కమిటీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేశాం...

- మొదటి పేజి తరువాయి

టన్నుల ధాన్యం సేకరించి, రైతుల ఖాతాల్లో రూ. 1,713 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 4 నుంచి 6 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రైతులు రూపాయి కూడా నష్టపోకుండా కల్లాల వద్దే ధాన్యం కొంటున్నామని స్పష్టం చేశారు.కొంతమంది నేతలు ధాన్యం కొనుగోళ్లపై అనవసరంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నింటినీ చెల్లించిందని గుర్తుచేశారు. ఈ సీజన్‌లో ఒక్క కృష్ణా జిల్లాలోనే లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం ఒక రికార్డు అని అన్నారు. గోదావరి జిల్లాల్లోనూ లక్ష టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు.
క్షేత్రస్థాయిలో అధికారులు రేయింబవళ్లు కష్టపడుతుంటే, వారి మనోధైర్యం దెబ్బతినేలా కొందరు విమర్శలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం 2022-23లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ. 679.79 కోట్లు చెల్లిస్తే, తమ ప్రభుత్వం ఇప్పటికే అంతకు రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు జరిపిందని పోల్చి చెప్పారు.రవాణా వ్యవస్థను కూడా పటిష్టం చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24లో కేవలం 455 లారీలు నమోదు కాగా, తమ ప్రభుత్వంలో ఇప్పుడు 2,715 లారీలు నమోదు చేసుకున్నాయని వివరించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో రవాణా వాహనాల బకాయిలు రూ. 9 కోట్లు చెల్లించామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 7.53 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచామని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో అదనంగా మరో లక్ష సంచులను సిద్ధం చేశామని చెప్పారు. వాతావరణ మార్పుల దృష్ట్యా రైతుల ఆందోళనను గమనించి మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియను ముందే ప్రారంభించామన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం 30వ తేదీ తర్వాత కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వర్ష సూచన ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వర్షాల నుంచి పంటను కాపాడేందుకు కౌలు రైతులకు టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచామన్నారు. దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ధాన్యం కొనే ప్రయత్నం చేస్తారని, ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 మద్దతు ధర చెల్లిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్‌లో నమోదైన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

# పవన్ కల్యాణ్‌వి తెలివితక్కువ మాటలు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన 'దిష్టి' వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపుతున్నాయి. కోనసీమ పచ్చదనానికి తెలంగాణ నేతల దిష్టి తగిలిందన్న పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్‌వి తెలివితక్కువ మాటలని, మెదడుకు పనిచెప్పకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు."మా దిష్టి వాళ్లకు తగలడం కాదు, ఇన్నేళ్లుగా వాళ్ల దిష్టే మా తెలంగాణకు, హైదరాబాద్‌కు తగిలింది" అని జగదీశ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రతిరోజూ వందలాది మంది ఏపీ నుంచే హైదరాబాద్‌కు వస్తున్నారని, అలాంటప్పుడు తమ దిష్టి ఎలా తగులుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ దిష్టి తగులుతుందని అంత భయంగా ఉంటే, ఓ దిష్టిబొమ్మ పెట్టుకోవాలని, దాన్ని తామేమీ ఆపలేదని వ్యంగ్యంగా అన్నారు. "ఇంత తెలివిలేని వాళ్లు కూడా ఉప ముఖ్యమంత్రులు అవుతున్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అంటూ జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.బుధవారం కోనసీమ జిల్లా రాజోలులో 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పచ్చని కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలింది. ఇక్కడి కొబ్బరి చెట్ల పచ్చదనాన్ని చూసే బహుశా వారికి ప్రత్యేక

రాష్ట్రం ఆలోచన వచ్చిందేమో" అని వ్యాఖ్యానించారు. నరుడి దిష్టికి రాయి కూడా పగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు.పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం కాగా, జగదీశ్ రెడ్డి తాజా ప్రతిస్పందనతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ మాటల యుద్ధం రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# బంగాళాఖాతంలో 'దిట్వా' తుపాను...

- మొదటి పేజి తరువాయి


ఈ తుపానుకు 'దిట్వా' అని నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ (%ఔమీా%) సభ్య దేశాల జాబితా ప్రకారం యెమెన్ దేశం ఈ పేరును సూచించింది. యెమెన్‌కు చెందిన సోకోత్రా ద్వీపంలో 'దిట్వా లగూన్' అనే పేరుతో ఒక చాలా ప్రసిద్ధమైన, అందమైన ఉప్పునీటి సరస్సు ఉంది. ఇప్పుడు ఆ ప్రదేశం పేరునే, బంగాళాఖాతంలో ఏర్పడే తుపానుకు పెట్టారు. ప్రస్తుతం సముద్రంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వ్యవస్థ మరింత బలపడి తీరం వైపు కదులుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.ఈ తుపాను వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంక తీరప్రాంతాన్ని దాటి, శనివారం నాటికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరితో పాటు దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం వైపునకు చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (%×వీణ%) అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరప్రాంత ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను కదలికలను నిరంతరం గమనిస్తూ, ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసేందుకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సన్నద్ధమైంది.చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (%=వీజ%) అంచనాల ప్రకారం, గురువారం దక్షిణ తమిళనాడు, డెల్టా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రత మరింత పెరగనుంది. ముఖ్యంగా డెల్టా, దాని పరిసర జిల్లాల్లో శుక్రవారం నాడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం నాటికి ఈ వాతావరణ వ్యవస్థ తీరం వెంబడి ఉత్తరం వైపు కదులుతున్న కొద్దీ, ఉత్తర తమిళనాడు జిల్లాల్లోనూ భారీ వర్షాలు నమోదవుతాయని అధికారులు వివరించారు.ఇదిలా ఉండగా, ఈశాన్య ఇండోనేషియా, మలక్కా జలసంధిపై కేంద్రీకృతమైన 'సెన్యార్' అనే మరో తుపాను తూర్పు వైపుగా కదులుతోంది. అయితే ఈ తుపాను వల్ల తమిళనాడుకు గానీ, భారత తీరానికి గానీ ఎలాంటి ముప్పు లేదని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

# స్వామివారి విషయంలో ఏ తప్పు చేయలేదు.. పాలీగ్రాఫ్ టెస్టుకు నేను సిద్ధం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యి కొనుగోలు వ్యవహారంపై జరుగుతున్న వివాదంపై టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. ఈ విషయంలో తనపై వస్తున్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని, అవసరమైతే పాలీగ్రాఫ్ పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, సిట్ దర్యాప్తును కేవలం 2019-24 మధ్య కాలానికే ఎందుకు పరిమితం చేస్తున్నారని ప్రశ్నించారు. అంతకుముందు జరిగిన కొనుగోళ్లపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.
తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆలయ ప్రతిష్ఠను పెంచేందుకే పనిచేశానని, దేవుడి విషయంలో ఎలాంటి తప్పు చేయలేదని సుబ్బారెడ్డి అన్నారు. తనపై విషప్రచారం చేస్తున్నారని, ఈ వివాదాన్ని పూర్తిగా రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో సీఎం చంద్రబాబు లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపణలు చేసినప్పుడు తాను సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తుచేశారు. తాను తప్పు చేసి ఉంటే న్యాయస్థానానికి ఎందుకు వెళ్తానని ప్రశ్నించారు.
సిట్ దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే కల్తీ నెయ్యితో లడ్డూలు తయారుచేశారని మీడియాలో కథనాలు రావడం దురదృష్టకరమని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నెయ్యి ట్యాంకర్లను క్షుణ్ణంగా

పరిశీలించి, ల్యాబ్ టెస్టుల తర్వాతే వినియోగించామని వివరించారు. ఈ విషయంలో మీడియా సంయమనం పాటించాలని సూచించారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి కొనుగోళ్లపై కూడా సమగ్రంగా దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీవాణి దర్శనం ద్వారా పారదర్శకత తీసుకువచ్చామని, శ్రీనివాస సేతు నిర్మాణంలో ప్రజాధనాన్ని ఆదా చేశామని, తిరుమలలో ప్లాస్టిక్‌ను నిషేధించామని తన హయాంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన గుర్తుచేశారు.

# థాంక్యూ సీఎం సార్..



**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ నవంబర్ 27**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం నూతన జిల్లా ప్రకటించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం తాడేపల్లి లోని సీఎం కార్యాలయంలో మర్యాదగాపూర్వకంగా కలిసి ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లాను చంద్రన్న మార్కాపురం జిల్లాగా ప్రకటించాలని వారిని కోరినట్టు స్థానిక టిడిపి కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు.

పెన్ పవర్ ప్రకాశం





## గుక్కెడు నీళ్లను ప్రసాదించి

# ఆదుకోండి మహాప్రభో

### ఆరు నెలలుగా నీటి సమస్య పట్టించుకోని అధికారులు

**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 27**

రాచర్ల మండల కేంద్రంలో నీటి సమస్యతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత 6 నెలలుగా ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతూ అధికారులకు మొరపెట్టుకున్నా దాహార్తిని తీర్చే అధికారి కరువయ్యారని ఆయా వీదులవాసులు వాపోతున్నారు.రాచర్ల పాత పోస్ట్ ఆఫీస్ బజారు, బీసీ కాలనీ, పలు వీధులలో నీటి బోరులు మరమ్మతులకు నోచుకోక గుక్కెడు నీటికోసం అష్ట కష్టాలు పడు తున్నా సంబంధిత అధికారులు అటు వైపుకన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నీటి బోర్లు మరమ్మతులకు వస్తే వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవటం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాడుక నీటికి తాగునీటికి కిలోమీటర్ల మేర వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని అధికారులకు పలుమార్లు తెలిపిన పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన నీటి మోటార్లను రిపేరు చేసి నీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## శభాష్... ప్రీతం కృష్ణ!

### దివ్యాంగుడికి వీల్ చైర్ అందించి మానవత్వం చాటుకున్న ప్రీతం కృష్ణ



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 27**

ఒక పేద దివ్యాంగ బాలుడికి వీల్ చైర్ అందజేసి, తన మానవత్వాన్ని చాటుకున్నారు తెలుగుదేశం యువనేత డాక్టర్ ప్రీతం కృష్ణ. స్థానిక తెలుగుదేశం నాయకురాలు, మాజీ పొదిలి సర్పంచ్, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ స్వర్ణ గీత, ప్రముఖ న్యాయవాది స్వర్ణ వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడైన డాక్టర్ ప్రీతం కృష్ణ పొదిలిలోని ఒక నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగ బాలుడు పరిస్థితి తన దృష్టికి రావడంతో వెంటనే స్పందించి తన సొంత నిధులతో వీల్ చైర్ కొనుగోలు చేసి ఆ బాలుడికి అందజేశారు. పొదిలి లోని ప్రకాష్ నగర్ లో నివాసం ఉంటున్న దేరంగుల విజయ్ కుమార్ అనే దివ్యాంగుడికి వీల్ చైర్ అంద జే సి, డాక్టర్ ప్రీతం కృష్ణ తన మానవత్వాన్ని చాటుకోవడం పట్ల పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ప్రీతం కృష్ణలాంటి మానవత్వం మూర్తిభవించిన పౌరులు సమాజంలో ఉంటే, సమాజాభివృద్ధి ఆశించిన మేరకు జరుగుతుందని పలువురు అభిప్రాయ పడ్డారు.

## మాలధారణ స్వాములకు బిక్ష వసతి కల్పించిన లక్ష్మీదేవి



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 27**

సి ఎస్ పురం మండల కేంద్రంలోని పామూరు రహదారి వద్ద ఉన్న అయ్యప్ప స్వామి పీఠంలో గురువారం మాలధారణ స్వాములకు సి ఎస్ పురం సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి కుమార్తె లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు బిక్ష వసతి కల్పించారు ఈ సందర్భంగా స్వామివారి పూజ కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందారు అనంతరం మాలధారణ స్వాములు సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను అయ్యప్ప స్వామి పీఠం వద్ద గల శేష వస్త్రంతో సత్కరించి, వారి కుటుంబంపై స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, యన్ సి మాలకొండయ్య, కోనంగి వెంకట కొండయ్య, కామనబోయిన వెంకటస్వామి, ఖాజా, ప్రసాదు, రాయిని వెంకటేశ్వర్లు, మాలాధారణ స్వాములు, స్థానికులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తుముల అశోక్ రెడ్డి కృషి ఫలితం గా గిద్దలూరు నియోజకవర్గం మార్కాపురం డివిజన్ లోనే పలించినా అశోక్ ని కృషి

### గిద్దలూరు ప్రజల హర్షం



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 27**

మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయంలో గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆశలు ఇక ఫలించాయి. అయితే నియోజకవర్గంలోని ఆరు మండలాలు కనిగిరి డివిజన్లో కలుస్తాయనే అనుమానాలు, ఆందోళనలు ప్రజల్లో నెలకొన్న నేపథ్యంలో, ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కారం కోసం శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నిరంతరంగా కృషి చేశారు. గత కొంతకాలంగా ఆయన పలుమార్లు అధికారులను, మంత్రులను, ముఖ్యమంత్రి ని వ్యక్తిగతంగా కలిసి గిద్దలూరు నియోజకవర్గానికి అన్యాయం జరగకుండా చూడాలని, అభివృద్ధి దృష్ట్యా ఈ ప్రాంతంలోని ఆరు మండలాలు మార్కాపురం డివిజన్లోనే కొనసాగాలనే విషయాన్ని స్పష్టంగా వివరించారు. గిద్దలూరు ప్రజల ఆకాంక్షలు, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా అవసరాలు అన్నింటినీ సమగ్రంగా వివరించి, ప్రజా ప్రయోజనాలను సమర్ధవంతంగా ప్రతిపాదించారు. అశోక్ రెడ్డి పట్టుదల, ప్రజల తరఫున చేసిన నిరంతరమైన పోరాటం చివరకు ఫలించింది. ముఖ్యమంత్రి గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను మార్కాపురం డివిజన్లోనే కొనసాగించేలా సానుకూలంగా అంగీకరించారు. ఈ నిర్ణయం గిద్దలూరు ప్రజల్లో ఎంతో ఆనందాన్ని, ఉపశమనాన్ని కలిగించింది. ఈ సందర్భంలో ఎమ్మెల్యే అశోకరెడ్డి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి తన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కీలక నిర్ణయం గిద్దలూరు ప్రాంతానికి పరిపాలనా సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా చేరడానికి దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. గిద్దలూరు ప్రజల హక్కుల కోసం భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కృషి చేస్తాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు.

## అండర్17 స్కూల్ గేమ్స్

### ఫెడరేషన్ ఆఫ్ఇండియా ఆధ్వర్యంలో బాల, బాలికల ఎంపిక



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 27**

ప్రకాశం జిల్లా అండర్ 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదర్శ బిఈడి కాలేజ్ గ్రౌండ్స్ లో బాల బాలికలకు గురువారం ఎంపికలు జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్ఈఓ లు ఎన్ అశ్విని కుమార్, పోలా నాగభూషణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఎంపిక కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఈఓ 2 పోలా నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ ఒంగోలుకు గిద్దలూరు చాలా దూరమైనప్పటికీ దాదాపుగా వందమంది క్రీడాకారులు హాజరవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు . అశ్విని కుమార్ మాట్లాడుతూ జిల్లాకు సుధూర ప్రాంతమైన గిద్దలూరు క్రీడాకారులు మీరందరూ రావడం సంతోషాదాయకం అన్నారు. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా తమ ప్రతిభను కనపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అండర్ 17 చీఫ్ ఆర్గనైజర్ గుర్రం శోభన్ బాబు, పిడీలు పి. జగజ్జివన్ కుమార్ ఎం.ధనలక్ష్మి, శ్రీలత, నారాయణ, సానిక వరం పీడీ శ్రీనివాసులు, రామ్మోహన్ రెడ్డి మాజీ జాతీయ క్రీడాకారులు మనోజ్, చింటూ, దిలీప్, పాల్గొన్నారు.

## ఉత్తమ గ్రామ సచివాలయ ఉద్యోగిగా ఎంపికైన శిరీషకు సన్మానం



**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 27**

కొమరోలు గ్రామ సచివాలయం 1 లో వెల్ఫేర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న శిరీష ను కొమరోలు గ్రామ సచివాలయాల సిబ్బంది గురువారం శాలువా పూలమాలతో చిరు సన్మానం చేసి అభినందించారు. భారత స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని కొంతమంది ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఆగస్టు 15న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందించి అభినందించారు. ఆ సందర్భంగా కొమరోలు గ్రామ సచివాలయం 1 లో వెల్ఫేర్ అసిస్టెంట్

**కొమరోలు 1 గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా పని చేస్తూ,జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగ ఎంపికై జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న శిరీష**

**శిరీషను అభినందిస్తూ చిరు సన్మానం చేసిన గ్రామ సచివాలయాల సిబ్బంది**

గా పని చేస్తున్న శిరీష ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైంది. అయితే అప్పటినుంచి ఆమె సెలవులో ఉన్నందువల్ల ఆమెకు గ్రామ సచివాలయాల సిబ్బంది సన్మానం చేయలేకపోయారు. కాగా గురువారం కొమరోలు లోని గ్రామ సచివాలయాల ప్రాంగణంలో శిరీషకు చిరు సన్మానం చేసి సన్మానించారు. కొమరోలు గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవరశెట్టి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శిరీషను దేవరశెట్టి బ్రహ్మయ్య, కొమరోలు గ్రామ సచివాలయం 2కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి, మూడు గ్రామ సచివాలయాల సిబ్బంది శాలువా పూలమాలతో సన్మానించి అభినందించారు.తనను సన్మానించిన వారందరికీ శిరీష పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థుల తల్లిదండ్రులకు లీప్ యాప్ సదుపాయం

### ఎంఈఓ రాజాల కొండారెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 27**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లి దండ్రులకు కూడా లీప్ యాప్ సదుపాయం కల్పిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి తెలిపారు. గురువారం ఆయన కెజిబివి విద్యాలయం, శీలంవారిపల్లి పాఠశాలలను తనిఖీ చేశారు విద్యాశాఖ రూపొందించిన లీప్ యాప్ లోకి తల్లిదండ్రులు వారి మొబైల్ నంబరుతో లాగిన్ కావచ్చు అన్నారు. లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రులను వారి పిల్లల పాఠశాల హాజరు వివరాలు వివిధ పరీక్షలలో విద్యార్థుల మార్కులు, ప్రభుత్వ ప్రోత్సాహకాల సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు డిసెంబర్ 5వ తేదీన మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పిటియం సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వలస ప్రాంతాల విద్యార్థుల కోసం మండలంలో వచ్చేనెల 1 వ తేదీనుంచి 2 సీజనల్ హాస్టళ్ళు ప్రారంభిస్తామని మండల విద్యాశాఖాధికారి కొండారెడ్డి తెలిపారు.

# దాతలసహాయం అభినందనీయం

### గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి



**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 27**

గిద్దలూరు శాఖా గ్రంధాలయములో వివిధపోటీ పరీక్షలకుసిద్ధ మయ్యే పుస్తకాలు, దినపత్రికలు తదితర పుస్తకాలు అమర్చు కొనుటకు అవసరమయ్య రూ 2000 లవిలువగల స్టీల్ ర్యాక్ , వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను విశ్రాంత్ర ఉపాధ్యాయులుడి. ముసల్ రెడ్డి గురువారంనాడు గిద్దలూరు శాఖాగ్రంధాల యమునకు బహుకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి.రామిరెడ్డి మాట్లాడుతూ దాతలసహాయం అభినందనీయం అన్నారు. ఈకార్యక్రమంలో గ్రంథపాకురాలు ఎన్ .ప్రసన్నకుమారి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి. రామిరెడ్డి ప్రధాన కార్యదర్శిజి.కిషోర్ కార్యదర్శిఎస్డి .ఫరూఖ్ విశ్రాంత ఉద్యోగులు డి.నారాయణ రెడ్డి పి. వెంకట రామిరెడ్డి పాఠకులు పాల్గొన్నారు.

# ఘనంగా వెన్నా హనుమారెడ్డి జన్మదిన వేడుకలు





**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ నవంబర్ 27**

వైఎస్ఆర్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, విహెచ్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.గురువారం మార్కాపురం మండలం దరిమడుగు లోని ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల అధ్యాపకులు,ఆధ్యాపకేతర సిబ్బంది నడుమ ఆయన జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, పలువురు వైకాపా నేతలు, ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధ్యాపకులు ఏర్పాటుచేసిన భారీ కేక్ ను విద్యార్థుల మధ్య కట్ చేశారు. కళాశాలలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని వెన్నా హనుమారెడ్డి ప్రారంభించారు.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి తర్లుపాడు జెడ్పిటిసి వెన్నా ఇందిరా, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకర్ బాబు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో ఘనంగా కటారి రాజు వర్ధంతి వేడుకలు



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 27**

దివంగత మాజీ పొదిలి ఎంపీపీ, ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు డాక్టర్ కటారి రాజు ఏడవ వర్ధంతి వేడుకలు పొదిలిలో గురువారం నాడు ఘనంగా జరిగాయి. ఆయన కుమారుడు భరత్ చంద్ర ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కటారి రాజు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మాట్లాడుతూ మండల పరిషత్ అధ్యక్షులుగా, ఆర్.ఎం.పి డాక్టర్గా కటారి రాజు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, మాజీ జెడ్పిటిసి కాటూరి వెంకటనారాయణ బాబు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, స్థానిక ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు డాక్టర్ భాస్కర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి, విద్యార్థునుల్లో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది

## దాన్ని వెలికి తీయాల్సిన భాధ్యత మనదే

## మాక్ అసెంబ్లీలో ప్రతిభ చాటిన విద్యార్థి రమ్యను సన్మానించిన టీడీపీ నాయకులు కృష్ణ కిషోర్

## ప్రోత్సాహకంగా రూ. 10,000 ల బహుకరణ -విద్యార్థి ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయుడికి సన్మానం

**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 27**

గిద్దలూరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పాములపల్లె గ్రామానికి చెందిన "నక్క రమ్య" సంవిధాన్ దివస్ - రాజ్యాంగ దినోత్సవ' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "మాక్ అసెంబ్లీ" కార్యక్రమానికి ఎంపికై, " రాష్ట్ర హోమ్ మంత్రిగా" తన ప్రతిభను చూపి అందరి మన్ననలు పొందింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు చిన్నారి రమ్యకు అభినందనలు తెలిపి ప్రశంస పత్రం అందచేశారు.. ఈ సందర్భంగా గురువారం గిద్దలూరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి, విద్యార్థిని "నక్క రమ్య" కు శాలువా వేసి అభినందనలు తెలిపారు. తన ప్రతిభను గుర్తించిన కృష్ణకిశోర్ ప్రోత్సాహకంగా రూ. 10,000/- లు అందచేశారు. అదే విధంగా తన ప్రతిభను గుర్తించి, తనకు అన్నీ విధాలుగా ప్రోత్సాహం అందించిన ఫిజికల్ సైన్స్ ఉపాద్యాయుడు ఎల్. సగీర్ ను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయటంతో పాటు వారిలోని ప్రతిభను గుర్తించి, ఆ ప్రతిభను వెలికితీసి వారికీ ప్రోత్సాహం అందించటం ద్వారా విద్యార్థులు రెట్టింపు ఉత్సాహంతో ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మండల విద్యాధికారులు పోలా నాగభూషన్ రెడ్డి, నల్లబోతుల అశ్విన్, గిద్దలూరు పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, బీజేపీ నాయకులు పిడతల రమేష్ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు గడ్డం భాస్కర్ రెడ్డి, పాలుగుళ్ళ చిన్నశ్రీనివాసరెడ్డి, బూనబోయిన



చంద్రశేఖర్, లోక్కు రమేష్, కో ఆప్షన్ మెంబర్ దమ్మాల జనార్దన్, స్కూల్స్



కమిటీ చైర్మన్ మోడీ బాలు నాయక్, మరియు గిద్దలూరు పట్టణ నాయకులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గోన్నారు.

# దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించడం కాంగ్రెస్ పార్టీ హర్షిస్తుంది

**దర్శి నవంబర్ 27 పెన్ పవర్**

కైపు వెంకటకృష్ణారెడ్డి రాష్ట్ర అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల చైర్మన్ దర్శి నియోజకవర్గం ఇన్చార్జి ఒక ప్రకటన చేశారు. దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించడం కాంగ్రెస్ పార్టీ హర్షిస్తుంది. దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కష్టమే నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించడం కానీ ఒకటి మిస్ అయింది. ప్రజలు గుర్తుంచుకోవాలి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అధికారులకి అర్జీల సంతకాల సేకరణ కృషి ఫలితమే దొనకొండ మండలం మరియు కురిచేడు మండలం ప్రజలు అభిప్రాయాలు తీసుకోకుండా మీ ఇష్టం వచ్చినట్టు నిర్ణయాలు తీసుకోవడం తగదు త్యాగాలన్నీ దర్శి నియోజకవర్గ ప్రజలు చేయాలి ఫలితాలు పక్కా నియోజకవర్గం లో తీసుకోవడం ఇది ఎంతవరకు



న్యాయం, రెవిన్యూ డివిజన్ దర్శి నియోజకవర్గం పనికి రాదా అద్దంకి నియోజకవర్గంలో ఉన్నది ఏంటి దర్శి నియోజకవర్గంలో లేనిదేంటి పక్క నియోజకవర్గంలో ఉన్న మంత్రిగారు గొట్టిపాటి రవి గారికి అర్థం కావట్లేదు దర్శి నియోజకవర్గంలో ప్రజలు తిరగబడితే పరిణామాలు ఎలా ఉంటాయో దొనకొండ మండలం కురిచేడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల తో రేపు, ఎల్లుండి ముఖ్య సమావేశాలు నిర్వహించి తదుపరి కార్యచరణ తెలియజేస్తాము నియోజకవర్గ విషయంలో త్యాగం చేసిన దర్శి నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్ ఇయ్యాలి లేదా అన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి వచ్చి మనకు రావాల్సిన హక్కుల కోసం పోరాడాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది.

# సిఐ సతీష్ కుమార్ హత్య కేసును సిబిఐకి అప్పగించాలి




**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 27**

తిరుమల పరకామణి చోరీ కేసులో ప్రత్యక్ష సాక్షి గుంతకల్లు రైల్వే సిఐ వై.సతీష్ కుమార్ ఈనెల 14వ తేదీ కోర్టుకు వెళుతున్న సమయంలో అనుమానస్పద మృతిగా మరణించడం జరిగింది. రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ దేశంలో సామాన్య మానవుడు కోర్టుకు వెళ్ళేది తనకు జరిగిన అన్యాయాన్ని కోర్టు ద్వారా న్యాయం జరిగేందుకు పోరాడాలంటే భయపడే పరిస్థితి ఎదురువుతున్నదని,. ఒక పోలీస్ అధికారిని హత్య చేయడం తో, రాష్ట్ర ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒకప్పుడు ఇంటర్నేషనల్ స్మగ్లర్ మాఫియా డాన్ శోభరాజ్ ఢిల్లీ తీహార్ జైలు నుండి తప్పించుకుంటే 24 గంటల్లో గోవాలో పట్టుకొని అరెస్టు చేసిన పోలీస్ ఇప్పుడు ఎంతో టెక్నాలజీ పెరిగిన వై. సతీష్ కుమార్ మరణం చేధించలేక పోవటంతో, మిస్టరీగా మారింది. అందుక కారణం అసెంబ్లీలో, పార్లమెంట్లో ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్ లలో ఏ డి ఆర్ విడుదల చేసిన నివేదికలో క్రిమినల్ కేసులు ఉన్నవారు అసెంబ్లీకి, పార్లమెంటుకు ఎన్నిక కావడం జరుగుతున్నదని. అందువల్ల ఇప్పటికైనా నేర చరిత్ర ఉన్న వారిని ఎన్నికలకు అనర్హులుగా ప్రకటించాలని ప్రజలు ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. సతీశ్ కుమార్ కేసును వెంటనే సీబీఐ కి అప్పజెప్పి, నేరస్తులను అరెస్టు చేయాలని, సతీష్ కుమార్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగము ఇవ్వాలని, ప్రభుత్వం 2 కోట్ల రూపాయలు ఎక్స్గ్రేసియా ఇవ్వాలని బీసీ సంఘాల ముక్తకంఠంతో కోరుతున్నాయి ఈవిషయమై గురువారం గిద్దలూరు తహశీల్దార్ ఎం.అంజనేయరెడ్డి కి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బి.సి.సంక్షేమ సంఘం అధ్యక్షుడు అద్దంకి. మధుసూధనరావు,బి.సి.సంఘము నాయకులు కంచర్ల. కోటయ్య గౌడ్,జె ఏసీ చైర్మన్ మాదాసు.రంగనాయకులు, గౌడ సంఘం కార్యదర్శి కంచర్ల స్వామి గుండమయ్య, ఇల్లూరి రంగశాయి, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తొండ మల్లు బ్రహ్మయ్య, రావిపాటి నాగరాజు, భీమవరం. రామాంజినేయులు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కాయల కోటిలింగాచారి, మేదరసంఘ కార్యదర్శి చందా శ్రీనివాసులు, నూరు భాషా సంఘం కె.కాశింపీరా, శాలివాహన సంఘం నాయకులు అద్దంకి. గోపాల్, దగ్గుపాటి వెంకటేశ్వర్లు టీచర్, దగ్గుపాటి శేఖర్, రావూరి రోశయ్య, రావూరి చెన్నయ్య, గుడిపాటి పాండు, అద్దంకి శ్రీనివాసులు, కుమ్మరి ఆంజనేయులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తోనే సాధ్యం -బొబ్బూరి రమేష్

**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 27**



రైతుల అభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో మండలంలోని బోయమడుగుల పంచాయతీలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బంది సమక్షంలో రైతుల ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు తదుపరి రైతులతో సమావేశం నిర్వహించి పీఎం కిసాన్ పథకం, అన్నదాత సుఖీభవ పథకం వివరాలను రైతు సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జి కోనంగి వెంకటకొండయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు కామనబోయిన వెంకటస్వామి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, మాజీ మండల టిడిపి అధ్యక్షులు పాలకొల్లు వెంకటరెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, గ్రామ పార్టీ అధ్యక్షులు రమణారెడ్డి, రష్యా నారాయణ, ప్రసాదు సచివాలయ సిబ్బంది గ్రామంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సేవ కేంద్రాల్లో అన్ని రైతన్న మీకోసం





**పెద్ద దోర్నాల పెన్ పవర్ నవంబర్ 27**

మండలం లోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతున్నా మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ పాల్గొని స్వర్ణంధ్ర ట 2047 కి అనుగుణంగా మన రాష్ట్రాన్ని ప్రగతి పథం లో భాగంగా రానున్న 5 సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు 5 విధానాలతో కార్యాచరణ మన రాష్ట్రం అమలు చేస్తుంది.నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రభుత్వం నుంచి మద్దతు గురించి రైతులకు వివరించడం జరిగింది. అలాగే భూసారా పరీక్ష లు ఆధారంగా ఎరువుల యాజమాన్యం, పచ్చి రొట్ట ఎరువులు, ప్రకృతి వ్యవసాయం,వ్యవసాయ యంత్రికరణ పథకాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు రెవిన్యూ అధికారి, గ్రామ పశు సంవర్ధక సహాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమాలను పరిశీలన

### మండల వ్యవసాయశాఖాధికారి పి మధుబాబు



**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 27**

మండలంలోని పెద్ద గోగులపల్లి, కొత్తపల్లి గ్రామాలలో గురువారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారి పి. మధుబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ప్రతి రైతు ఇంటిని సందర్శించి ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు అందించాలని సూచించారు.ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇన్చార్జి చావా చంద్రశేఖర్, ఆయా గ్రామ పరిధిలోని సచివాలయ సిబ్బంది, ఆయా గ్రామ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

# బదిలీ కాబడిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి





**అర్ధవీడు, పెన్ పవర్, నవంబర్ 27**

మండల పరిషత్ జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల 2025 జూన్ నెలలో బదిలీ కాబడిన ఉపాధ్యాయులను వారు కోరుకున్న స్థానాలకు వెంటనే పంపించాలని అలాగే, 30 సంవత్సరముల సర్వీస్ కలిగి 55 సంవత్సరం దాటిన వారిని ఇప్పుడు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ రాయమని చెప్పడం అన్యాయమని ఈసారి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు చేయాలని ఎస్టియు జిల్లా అధ్యక్షులు కే ఎర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అర్ధవీడు మండలం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని మొహిద్దిన్ పురం, బోగోలు , మిట్టమీదిపల్లి, వీరభద్రపురం, చెర్లో దొనకొండ అర్ధవీడు, పాపినేనిపల్లి గ్రామాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదును చేయుంచారు. ఉపాధ్యాయ సమస్యలను సేకరించారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నది, విద్యాబోధన ముగిసే వరకు విద్యా వాలంటీర్లతోనైనా విద్యార్థుల చదువు కుంటూపడకుండా చేయాలని కోరారు. నాడు నేడు కింద ఆగిపోయిన భవనాల పూర్తి చేయుటకు నిధులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లు డి సిద్ధిక్, జిల్లా కార్యదర్శి డి నబిఖాన్ , మండల శాఖ అధ్యక్షులు అంబటి వెంకట రావు , ప్రధాన కార్యదర్శి మునిగేటి మహేష్ , ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు అండ...

## మినీ గోకులం –పోట్ల గోవింద్



**పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 27**

పుల్లల చెరువు మండలం మల్లపాలెం గ్రామ పంచాయతీలో పల్లె పండుగ 2.0 సందర్భంగా మినీ గోకులం షెడ్ శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్ పోట్ల గోవిందు మాట్లాడుతూ పాడి రైతులకు అండగా మినీ గోకులం అని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టిందన్నారు.గత వైసీపీ పరిపాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో వాటికి పూర్వవైభవం తెచ్చిందన్నారు.గ్రామాల్లో పశుపోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకం దార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించుకోవొచ్చని ఆయన తెలిపారు.గోకులం పథకం కింద షెడ్లనిర్మాణానికి పశువుల పెంపకందార్లకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు 70 శాతం చొప్పున రాయితీలు కల్పిస్తారనీ ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రగొండ పాలెం నియోజకవర్గం ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు,పుల్లల చెరువు టిడిపి మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, పుల్లల చెరువు పరపతి సంఘం అధ్యక్షుడు పాతకోటి రామి రెడ్డి, నాయుడు పాలెం ఎంపీటీసీ వెంగయ్య,సీనియర్ నాయకులు శనగ నారాయణ రెడ్డి,రెంటపల్లి సుబ్బారెడ్డి, మేడికొండ లక్ష్మణ్, ఏవో మరియదాసు,ఏపీఓ మోషే,ఈసి పాల్గొన్నారు.

# చంద్రబాబుకు రుణపడి ఉంటాం

**నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ కందుల రామిరెడ్డి**





**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ నవంబర్ 27**

మార్కాపురం ప్రత్యేక జిల్లా ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేశారు.గురువారం పట్టణంలోని 25వ వార్డులో ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజలు, మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి,ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞత తెలియజేయడానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జి కందుల రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉంటామని అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని గతంలో కోరామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు ఎంతో వివక్షతో ఈ ప్రాంతాన్ని విస్మరించారని ఆవేదనను వ్యక్తం చేసారు. గతంలో హామీ ఇచ్చిన విధంగానే ఇప్పుడు మార్కాపురం జిల్లా ప్రకటించటం చంద్రబాబు నాయుడుకి ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికి రుణపడి ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# గిద్దలూరు నియోజకవర్గంలోని 5 మండలాలను మార్కాపురం డివిజన్ లోనే కొనసాగించాలి

**కనిగిరి డివిజన్లో కలపటం వల్ల అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు.**

**పరిష్కారానికి గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు అందరూ కృషి చేయాలి.**

**వైసీపీ జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి చెదుల్ల వెంకట రమణారెడ్డి విజ్ఞప్తి.**



**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 27**

గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు, గిద్దలూరు, రాచర్ల, బేస్తవారిపేట, కంభం మండలాలను మార్కాపురం డివిజన్ లోనే కొనసాగించాలని వైసిపి జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి చెదుల్ల వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలను ఏర్పాటు చేయుటకు నిర్ణయం తీసుకున్నదని, అందులో భాగంగా మార్కాపురం ను జిల్లాగా చేయటంతో గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లుగా ఆయన చెప్పారు. అయితే మార్కాపురం డివిజన్లలో ఉన్న గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు, గిద్దలూరు, రాచర్ల, బేస్తవారిపేట, కంభం మండలాలను మార్కాపురం డివిజన్ నుంచి వేరు చేసి కనిగిరి రెవిన్యూ డివిజన్లో కలుపుతున్నట్లుగా అధికారికంగా ప్రకటించారని ఆయన తెలిపారు. దీనితో మార్కాపురం జిల్లా కేంద్రంగా మారుతున్నదని సంతోషపడుతున్న అన్ని వర్గాల ప్రజలకు గిద్దలూరు నియోజకవర్గం లోని ఐదు మండలాలను మార్కాపురం నుంచి విడదీసి కనిగిరి డివిజన్లో కలుపుతున్నారనే సమాచారాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు అంతేగాక తీవ్ర ఆవేదన నిరసన వ్యక్తం చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఏర్పడినప్పటి నుంచి గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాలు మార్కాపురం డివిజన్లో భాగంగా ఉంటూ వచ్చాయని ,దీనితో మార్కాపురం తో గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ఎంతో సౌకర్యం. అనుబంధమున్నదని తెలిపారు. కేవలం 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మార్కాపురం వెళ్లి రావడానికి ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఉన్నదని , అంతేకాక డివిజన్ కేంద్రమైన మార్కాపురం లోని అధికారులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, రాజకీయవేత్తలతో రైతు సంఘ నాయకులతో సన్నిహిత అనుబంధాలు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు .అయితే మార్కాపురంను జిల్లాగా చేస్తూనే గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు మినహా మిగిలిన 5 మండలాలను కనిగిరి డివిజన్లో విలీనం చేయటం సమంజసం కాదని, దీనిని ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారని ఆయన తెలిపారు. 60 కిలోమీటర్ల లో ఉన్న మార్కాపురంనకు ఉదయం వెళ్లి పనులు ముగించుకొని సాయంత్రానికి నేరుగా ఇంటికి చేరే వెసులుబాటు, సౌకర్యాలు ఉన్నాయని, అయితే 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న కనిగిరి కి రాకపోకలు సాగించేందుకు బస్సుల సౌకర్యం లేదని ,కనిగిరి వెళ్లాలంటే కొమరోలు మండల ప్రజలు బేస్తవారిపేట వరకు వెళ్లి అక్కడ నుంచి మరో బస్సులో కనిగిరి వెళ్లవలసి ఉంటుందని ఆయన తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గం లోని అర్ధవీడు మినహా మిగిలిన 5 మండలాలను కనిగిరి డివిజన్లో కలిపేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఐదు మండలాలలోని అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని ,అందువల్ల గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు అందరూ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సదరు 5 మండలాలను మార్కాపురం డివిజన్లోనే కొనసాగించే విధంగా కృషి చేయాలని ఆయన ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా కొమరోలు ,గిద్దలూరు ,రాచర్ల, బేస్తవారిపేట ,కంభం మండలాలను కనిగిరి డివిజన్ లో కలిపేందుకు నిర్ణయం తీసుకునే పరిస్థితులు ఏర్పడితే ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు ఐదు మండలాలలోని అన్ని వర్గాల ప్రజలతో ప్రజా ఉద్యమం చేపట్టేందుకు కూడా కృషి చేయవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు .కావున ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునరాలోచించి, అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ గిద్దలూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలను మార్కాపురం డివిజన్లోని కొనసాగించేందుకు చర్యలు తీసుకొని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను, అభిప్రాయాలను నెరవేర్చాలని రమణారెడ్డి డిమాండ్ చేశారు.

# సమిష్టి ఉద్యమ పోరాటం ఫలించింది



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 27**

వెనుకబడిన పశ్చిమ ప్రాంత మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా ప్రకటించడం పై మార్కాపురం జిల్లా జిల్లా సాధన సమితి నాయకులు హర్షం వ్యక్తం చేసారు.మార్కాపురం నూతన జిల్లా ఏర్పాటు ప్రకటన మార్కాపురం జిల్లా సాధన సమితి సమిష్టి ఉద్యమ ఫలితమేనని గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కారణమైన మార్కాపురం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో విజయోత్సవ సమావేశం జరిగింది.మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన పట్ల ఆనందం వ్యక్తం చేస్తూకేకును కట్ చేసి టపాసులు కాల్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలను వేయడం జరిగింది.ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా సాదన సమితి కన్వీనర్ మెడబలిమి వెంకటేశ్వరరావు,కో కన్వీనర్లు సిపిఐ సీనియర్ నాయకులు టి.సి.హెచ్.చెన్నయ్య,బహుజన ఐక్యవేదిక అధ్యక్షులు కోట డేవిడ్,ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, సాధన సమితి నాయకులు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ఏర్పాటు ప్రకటన మార్కాపురం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలోని ఉద్యమ ఫలితంగా ఈ ప్రకటన వెలువడిందని హర్షం వ్యక్తం చేశారు.ఈ ప్రాంత ప్రజల కలలు సాకారం అయ్యాయని,ఈ ప్రాంత ప్రజల కలల సహకారం నేటికి ఇంకా పూర్తి కాలేదని,గిద్దలూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని,దొనకొండ,కురిచేడు మండలాలు ఒంగోలుకు సుదీర్ఘ దూరం కావడంతో దర్శి నియోజకవర్గాన్ని కూడా మార్కాపురం నూతన జిల్లాలో బాగం చేయాలని డిమాండ్ చేశారు.మార్కాపురం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో 65 రోజులు పాటు సుదీర్ఘ ఉద్యమంలో పాలుపంచుకున్నటువంటి వివిధ రాజకీయ పార్టీలు,ప్రజాసంఘాలు,కార్మిక కర్షక,రైతు,వివిధ కుల సంఘాలు,విద్యార్థి,యువజన మహిళలు,ఉద్యోగ సంఘాల అందరికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఏ ఒక్కరి నాయకత్వంలో జరిగిన ఉద్యమం కాదని ఇది సమిష్టి ఉద్యమమేనని సమిష్టి విజయమేనని తెలిపారు.మార్కాపురం జిల్లా ఏర్పాటులో ఇంకా జరగాల్సిన అంశాలపై కూలంకుశంగా మాట్లాడుకొని తదుపరి ఉద్యమం చేయబడతామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రాచేటి ప్రసాదరావు వికలాంగుల పోరాట సమితి అధ్యక్షులు గుమ్మా రాజయ్య, గజ్జ వెంకటేశ్వర్లు, చేదురి లక్ష్మయ్య నియోజకవర్గ బీసీ నాయకులు ముటుకూరీ వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు గర్నెపూడి వినయ్,తూమాటి చిన్నసుబ్బయ్య,చెన్నకేశవులు,ఇజమ్మ యాదవ్,వెంకటయ్య గౌడ్, కార్మిక,కర్షక,రైతు,విద్యార్థి,యువజన,ప్రజా సంఘాల నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



**పొన్నలూరు పెన్ పవర్ నవంబర్ 27**

పొన్నలూరు మండలంలోని చెరుకూరు రెవిన్యూ గ్రామం సర్వే నెంబర్ 787/1 లోని ప్రభుత్వ భూములలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వి. పుల్లారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవిన్యూ అధికారి విజయ్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ బి. శివకృష్ణ పాల్గొన్నారు.

# ఉపాధి పనులకు గ్రామ సభ నిర్వహణ





**పెన్ పవర్ ,కంభం నవంబర్ 27:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2026 2027 సంవత్సరమునకు పనులు గుర్తింపు ప్రక్రియ మరియు గ్రామసభ నిర్వహించడం జరిగింది. కంభం మండలంలోని తురిమెళ్ళ పంచాయతీ పరిధిలో గురువారం ఏపీవో జీవరత్నం పిఆర్ఏ ద్వారా పనుల గుర్తింపు మరియు అంచనాల తయారీ విధానము గురించి గ్రామస్తుల కు తెలియజేయటం జరిగింది.ముఖ్యంగా నేటిసంరక్షణ పనులు,నీటినిల్వ కందకాల పనులు గుర్తించాలని తెలిపారు . ఈ గ్రామసభనందు పంచాయతీ ప్రెసిడెంట్ మాధ. సుభద్ర పంచాయతీ సెక్రటరీ రమేష్ రెడ్డి మాజీ సర్పంచ్ వీరమ్మ ఉపాధిహామీ కూలీలు గ్రామస్తులు లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

# కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నూతన ఏటిఎం ను ప్రారంభించిన కదిరి పార్ధసారధి





**సి ఎస్ పురం, పెన్ పవర్ నవంబర్ 27**

శీలంవారిపల్లి గ్రామంలో గల కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు ఏటిఎంను గురువారం సెక్రటరీ –కరెస్పాండంట్ కదిరి పార్ధసారధి దంపతులు, తిరుపతి కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల లోని విద్యార్థులు మరియు పరిసర గ్రామాల ప్రజలు కళాశాలలో ఏర్పాటు చేసిన ఏటిఎం సేవలను ఉపయోగించు కోవాలని అన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఏటిఎం ద్వారా నగదు జమ చేయవచ్చును మరియు నగదు తీసుకువచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్స్ బి. రాఘవేంద్ర, డివిజనల్ మేనేజర్ వై. శ్రీనివాసులు, కె. లీల ప్రతాప్, సియస్ పురం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పి. సంజయ్ కుమార్, మేనేజర్ జె. సతీష్, మరియు కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, కళాశా,మునగల వెంకట నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి, తీకెనం బాబురావు,యన్. నారాయణ, టి లక్ష్మినారాయణ, నాయబ్ రసూల్,యం. మస్తాన్ రెడ్డి,యం సుబ్బారెడ్డి,కె.వెంకటాద్రి, దుగ్గని సుబ్బయ్య, పెన్నం నరసింహ, మామిడేల శ్రీనివాసులు, చిన్న వెంకటయ్య,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన సదస్సు.



**అరకులోయ పెన్ పవర్ 27:** కమిషనరేట్ ఆఫ్ కాలేజీఏట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అరకులోయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ అధ్యక్షతన డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోస్టర్ పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. అదేవిధంగా మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటువంటి పోటీలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఎయిడ్స్ వ్యాధి పట్ల మరింత అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్.పి. కొండబాబు మెంబర్స్ పి.సుందరి రాణి, ఎం. అనిత కుమారి అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మొదటి గురువారం పూజలతో కనకమహాలక్ష్మి మార్గశిర ఉత్సవాల ఆరంభం






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27** :విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసో త్సవాలు ఈరోజు తొలి గురువారం పూజలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. దక్షిణ నియోజ కవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పద్మజ దంపతులు అమ్మవారి గర్భాలయంలో పంచా మృతాభిషేకాలతో పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

ఆలయ ఈవో శోభారాణి, ఉత్సవ కమిటీ స భ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆలయ మండపంలో ఆశీ ర్వచనం చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అంద జేశారు. పూజలు పూర్తయ్యాక అలయ దర్శన వైదికాలు ప్రారంభించడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించు కున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ,మొదటి గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ముందస్తు ప్రణాళికతో తగిన ఏర్పాట్లు చేశాం. అదనపు సిబ్బంది, భద్రతా చర్యలు, క్యూ లైన్ నిర్వహణ వంటి అన్ని ఏర్పాట్లను విస్తృతంగా అమలు చేశాం, అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్, కూటమి నేతలు, పోలీసు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# 66 వార్డ్ అభివృద్ధి పనులు వేగవంతం



**గాజువాక :పెన్ పవర్ ,నవంబర్ 27** మహా విశాఖ నగర పాలక సంస్థ 66 వార్డులో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం సమపాల్లుగా అందిస్తున్న కూటమి ప్రభుత్వం . వార్డులో ఎన్నో ఏళ్లగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని శిథిలమైపోయిన పనులన్నీ సరే వేగంగా జరుగడం విశేషం . రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వర్కుల్ని కైలాష్ నగర్ లో, ఇందిరా కాలనీలో, బీసీ రోడ్లో, రోడ్డు వర్కుల్ని, పెద్ద కాలవల్ని, దగ్గరుండి, కాంట్రాక్టర్లతోని క్వాలిటీ కంట్రోల్ వాళ్ళని వార్డు వర్క్ ఇన్స్పెక్టర్ ని కలిసి పనులని 66వ వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు, సీనియర్ తెలుగుదేశం నాయకులు వార్డు ట్రెజరర్, లక్ష్మణరావు, వార్డు మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ భాష, వర్క్ ఇన్స్పెక్టర్ గంగాధర్ తో కలిసి పరిశీలించారు . పరిపాలన అంటే సంక్షేమ%శీ% తో పాటు, అభివృద్ధి, ప్రజలు భద్రత, పిల్లల భవిష్యత్తు, సుపరిపాలనకు నిదర్శనం అని పలువురు కితాబునిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కి పారిశ్రామిక ప్రాంత వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .

# రింతాడలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 27**: గూడెం కొత్త వీధి మండలంలోని రింతాడ పంచాయతీ పరిధిలోని వర్మీ కంపోస్ట్ కేంద్రం వద్ద మండల పరిషత్ నిధులతో రూ. 2 లక్షల వ్యయంతో నిర్మించనున్న బోరు పనులకు స్థానిక సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి బోరు త్రవ్వకం పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా జీ.కే. వీధి వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ, కూటమి నాయకులు, ఏఎంసీ డైరెక్టర్ చింతపల్లి, టిడిపి రింతాడ గ్రామ కమిటీ అధ్యక్షులు మొట్టడం శరభన్న దొర, టిడిపి సీనియర్ నాయకులు సాగిన రంగారావు, వైసిపి సీనియర్ నాయకులు బొబ్బిలి లక్ష్మణ్,బొబ్బిలి వెంకట్రావు, రామ్మూర్తి, చందు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద ఉదయం విషాదం

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** లక్ష్మివారం తెల్లవారుజామున విశాఖ పశ్చిమ, గోపాలపట్నం పెట్రోల్ బంక్, సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. సంఘటన సుమారు ఉదయం 5.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. ప్రారంభ సమాచారం ప్రకారం, ఆ వ్యక్తి బస్సు కింద పడటంతో గానీ, బస్సు ఢీకొట్టడంతో గానీ తీవ్ర గాయాలు పొందాడు. ప్రయాణికులు, స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించకపోవడంతో, అతని వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రజల సహాయం కోరుతున్నారు. ఈ వ్యక్తి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు కింది నెంబర్లకు సమాచారం ఇవ్వవలసిందిగా పోలీసులు విజ్ఞప్తి చేశారు. గోపాలపట్నం సీఐ నెం.9440796020, ఎస్సై నెం.83310 41648 పోలీసులు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణం పరిసీలించడంతో పాటు, బస్సు డ్రైవర్ మరియు ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారిని కూడా విచారిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలన కూడా జరుగుతోంది.

# పశ్చిమ 89వ వార్డులో ఘనంగా మౌర్యసింహ జన్మదిన వేడుకలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** జీవీఎంసీ 89 వ వార్డు, కొత్తపాలెంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు తనయుడు, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మౌర్యసింహ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కొత్తపాలెం పిఎసిఎస్ చైర్మన్, వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్ కుమార్ సౌజన్యంతో ఈ వేడుకలు ఘనంగా జరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జన్మదిన శుభాకాంక్షలు అందుకున్న మౌర్యసింహ హాజరయ్యారు. వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు, ట్రాఫిక్ సీఐ సురేష్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పార్టీ నాయకులు, కార్యకర్తల సందడి..**

ఈ సందర్భంగా మౌర్యసింహతో కలిసి నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, స్థానిక కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరై వేడుకలకు ప్రత్యేక రంజు కలిగించారు. నాయకుల్లో దాడి సురేష్, పెప్సీ రమణ, శెట్టి గోపి, గవ్వ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**సామాజిక సేవపై దృష్టిమౌర్యసింహ..**

ఈ సందర్భంగా మౌర్యసింహ మాట్లాడుతూ, పార్టీ సేవలకోసం యువత మరింతగా ముందుకు రావాలని, ప్రజాభివృద్ధి కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తామని ఆశయాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. స్థానిక ప్రజల నుంచి అభినందనలు అందుకున్న ఆయన, పార్టీ బలోపేతం కోసం నిరంతర కృషి చేస్తామని తెలిపారు.

**స్థానిక రాజకీయాలకు బలం..**

ఈ వేడుకలో యువత, పార్టీ అనుబంధ సంఘాలు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా స్థానిక రాజకీయ వాతావరణంలో టీడీపీకి పెరుగుతున్న ఆదరణ స్పష్టమైందని స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలా వర్గ సంబంధాలు బలోపేతం చేయడం పార్టీకి భవిష్యత్తులో మేలు కలిగిస్తుందని అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించి 500 మందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని స్థానిక టిడిపి నాయకులు కలిసి నిర్వహించాయి. హెల్మెట్ల పంపిణీతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నిర్వాహకులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# విశాఖ పశ్చిమలో ఘనంగా మౌర్యసింహా జన్మదిన వేడుకలు

## ప్రజాకర్షణ, రాజకీయ సంకేతాలతో అంగరంగ వైభవంగా వేడుకలు







**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** విశాఖపట్నం, గోపాలపట్నం ప్రాంతంలోని ఇండోర్ స్టేడియం, జడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు కుమారుడు, టీడీపీ యువనేత మౌర్యసింహ్ జన్మదిన వేడుకలు శనివారం భారీగా నిర్వహించాయి. ఈ వేడుకలు కేవలం పుట్టినరోజు సందర్భం మాత్రమే కాకుండా, స్థానిక రాజకీయ సమీకరణలు, యువతను ఆకర్షించే కృషి, రెండు పార్టీల కూటమి కలిసికట్టుగా పనిచేస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపించాయి.

**క్రీడా కార్యక్రమంతో ప్రజల్లోకి షటిల్ టోర్నమెంట్ ఆకర్షణ..**

మౌర్యసింహ్ జన్మదినం సందర్భంగా ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విజేతలకు మౌర్యసింహ్, విశాఖ పశ్చిమ నియోజకవర్గం జనసేన నాయకురాలు అంగ దుర్గ ప్రశాంతి చేతుల మీదుగా బహుమతులు, షీల్డులు అందజేయడం టిడిపి, జనసేన కూటమి అనుబంధాన్ని బలోపేతం చేసే సూచనగా స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. క్రీడల ద్వారా యువతను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇది యువజనంతో మౌర్యసింహ్ మధ్య అనుబంధాన్ని పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తులో నాయకత్వంపై ఆయన కలిగించే ప్రభావాన్ని కూడా సూచించే అంశంగా కనిపించింది.

**కార్యాలయ వేడుకలు.. స్థానిక నాయకుల ఐక్యతకు వేదిక..**

తదనంతరం విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమానికి టీడీపీ కార్పొరేటర్లు, కూటమి నేతలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ హాజరు స్థానికంగా మౌర్యసింహ్ ప్రభావం పెరుగుతోందనే సంకేతంగా భావించబడుతోంది. పార్టీ కార్యకర్తల నుంచి అభిమానుల వరకు విస్తృత హాజరు ఉండటం, ప్రజల్లో మౌర్యసింహ్ పట్ల ఉన్న ఆదరణను ఆవిష్కరించింది.

**ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' – మౌర్యసింహ్ స్పందన..**

జన్మదిన వేడుకల సందర్భంగా మాట్లాడిన మౌర్యసింహ్ నాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు. మీ ప్రేమ, ప్రోత్సాహం నాకు ప్రజాసేవలో మరింత బలాన్నిస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు యువ నాయకునిగా ఆయన సేవా దృక్పథాన్ని మరియు ప్రజలతో అనుబంధాన్ని పెంచుకునే ప్రయత్నాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్లు, కూటమి నేతలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్రీడాకారులు పాల్గొనడం గమనార్హం. విభిన్న వర్గాల హాజరు కూటమి అంతర్గత ఐక్యతకు, మౌర్యసింహ్ వ్యక్తిగత ప్రజాదరణకు సూచనగా కనిపిస్తోంది.

ఈ వేడుకలలో మూడు ప్రధాన అంశాలు స్పష్టంగా వెలుగులోకి వచ్చాయి. కూటమి సమన్వయ బలపరచడం, జనసేన నాయకురాలు అంగ దుర్గ ప్రశాంతి పాల్గొనడం బహుమతులు అందజేయడం. టీడీపీ, జనసేన కూటమి అనుకూల వాతావరణాన్ని పునరుజ్జీవింపజేసే ప్రయత్నంలా కనిపించింది. యువతను ప్రోత్సహించే రాజకీయ వ్యూహం. షటిల్ టోర్నమెంట్ వంటి క్రీడా కార్యక్రమాలు యువతను ఆకర్షించే, వారితో అనుబంధాన్ని పెంచుకునే చర్యగా చూడవచ్చు. మౌర్యసింహ్ పట్ల పెరుగుతున్న మద్దతు. విభిన్న వర్గాల భారీ హాజరు ఆయనను భవిష్యత్తు నాయకుడిగా నిలపాలన్న పార్టీ యాజమాన్యం వ్యూహానికి బలం చేకూరుస్తోంది. విశాఖ పశ్చిమలో మౌర్యసింహ్ జన్మదిన వేడుకలు కేవలం వేడుకలుగానే కాకుండా రాజకీయ సందేశాలు, కూటమి ఐక్యత, యువత ఆకర్షణ, పార్టీ బలోపేతం వంటి అంశాలతో కూడిన కార్యక్రమాలుగా నిలిచాయి.

# విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో సీ.ఎం.రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ






**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు సోమవారం 91, 92, 89, 40, 90, 57వ వార్డులకు చెందిన పలు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. వైద్య కారణాల వల్ల బాధపడుతున్న మరియు అత్యవసర వైద్య సహాయం అవసరమైన కుటుంబాలకు ఈ చెక్కులు అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా గణబాబుమాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స అందడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తోంది. ఈ నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకుని వైద్య సేవలు పొందాలని ప్రతి లబ్ధిదారు గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు.

అలాగే పార్టీలకు అతీతంగా, కేవలం అర్హతను ప్రమాణంగా తీసుకుని మాత్రమే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేస్తున్నాము. అవసరమైన వారికి సహాయం అందేలా ప్రభుత్వంగా, వ్యక్తిగతంగా కృషి చేస్తూనే ఉంటామని గణబాబు పేర్కొన్నారు.

లబ్ధిదారుల వివరాలు..

యండమూరి సురేష్ రూ.లక్ష 30వేల,524లు, కర్రీ అన్నపూర్ణ రూ.28 వేల 400లు, పసి లావణ్య 2 లక్షల, 32 వేల, 857లు, కాకర హారిక రూ.25 వేల,650లు, ఏ.ఏ. సూరిదేముడు రూ.28 వేలు, వి.వెంకట శ్యామల రూ.20 వేల, 524లు, మింది అప్పలరాజు రూ.లక్ష, ఒక వెయ్యి,762లు, ఎస్. పాండా రూ.84వేలు,928లు, తుంపల శ్రీనివాసరావు రూ.49వేలు,067లు, పి. కృష్ణవేణి సాహు రూ.75 వేలు, మొత్తం మంజూరైన రూ.7 లక్షల,76వేలు,717లు పంపిణీ చేశారు.

లబ్ధిదారుల కృతజ్ఞతలు..

సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన నిధులు తమకు చేరేలా ప్రత్యేకంగా కృషి చేసిన గణబాబుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మరియు కూటమి నాయకులు బొడ్డేటి విజయ్, పెంటకోట అజయ్ బాబు, పొన్నాడ రమణరావు (పెప్సి రమణ), గవ్వ భాస్కర్, అంగటి మూర్తి, తతబాబు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా యువ నాయకుడు మౌర్య సింహ జన్మదినోత్సవ వేడుకలు

ఐజిఎం ఆధ్వర్యంలో భక్తి, భావాలతో ప్రత్యేక కార్యక్రమాలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** పశ్చిమ నియోజకవర్గం, జీవీఎంసీ 91వ వార్డు పరిధిలోని ఇన్ గ్లోరీ మినిస్ట్రీస్ (ఐజిఎం) ఆధ్వర్యంలో యువ నాయకుడు మౌర్య సింహ జన్మదినోత్సవ వేడుకలు గురువారం అత్యంత శోభాయమానంగా నిర్వహించబడ్డాయి. స్థానిక బెత్తసస్తా చర్చి ప్రాంగణం పూలతో అలంకరించబడి పండుగ వాతావరణాన్ని తలపించింది. రంగురంగుల లైటింగ్, అలంకరణలు, భారీ హోర్డింగ్స్, శుభాకాంక్షా బ్యానర్లు చర్చి ప్రాంతం మొత్తం సందడి వాతావరణాన్ని మరింతగా పెంచాయి.

వేడుకలలో భాగంగా చర్చి పెద్దలు, క్రైస్తవ సంఘ కాపరులు, ఐజిఎం నాయకులు కలిసి మౌర్య సింహకి ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థనలు జరిపారు. ఆ తరువాత చర్చి పెద్దల సాక్షిగా జన్మదిన కేక్ కట్ చేయబడింది. పలువురు నాయకులు, విశ్వాసులు వరుసగా మౌర్య సింహని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మౌర్య సింహ మాట్లాడుతూ

ఇలాంటి పవిత్ర స్థలంలో నా పుట్టినరోజును జరుపుకోవడం నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సందర్భం. మీ అందరి ప్రార్థనలు, ఆశీర్వాదాలు, ప్రేమ నాకు మరింత సేవా స్ఫూర్తిని, ప్రజా సేవ పట్ల నిబద్ధతను పెంచుతున్నాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా మరింత శ్రద్ధగా పనిచేస్తానని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వేడుకలకు తెలుగుదేశం క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు శ్రీ కుమార్, ఐజిఎం పెద్దలు, స్థానిక క్రైస్తవ సంఘ నాయకులు, యువత, విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం మొత్తం భక్తి%-%భావాలతో సాగి, పాటలు, స్తోత్రాలతో చర్చి ప్రాంగణం ఉత్సాహంగా మారింది. రోజంతా కొనసాగిన ఈ వేడుకలు ఆ ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక, ఆనందోత్సాహభరితమైన అనుభూతిని అందించాయి.

# మహిళల రక్షణ మరియు భద్రత పై అవగాహన

◆ బ్రాండిక్స్ కంపెనీలో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం





**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 27 :** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పోలీసులు బ్రాండిక్స్ కంపెనీలో మహిళా ఉద్యోగుల కోసం మహిళా భద్రత, చట్టాలు, సైబర్ భద్రత వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ

ఈ.శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్ నీలిమ, వన్ స్టాప్ సెంటర్ ఎస్సై రాములమ్మ పాల్గొని కీలక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా చట్టాలు, మహిళా రక్షణకు సంబంధించిన నూతన క్రిమినల్ చట్టాలు, గృహహింస వంటి ముఖ్యమైన చట్టాలపై అవగాహన కల్పించారు.

పోక్సో చట్టం, బాలికలపై నేరాలను నిరోధించడానికి ఉన్న నిబంధనలు, శిక్షలు, శక్తి యాప్ వినియోగం, అత్యవసర సమయంలో పోలీసులు వెంటనే సహాయం అందించే విధానం తెలిపారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, హరాస్‌మెంట్, సోషల్ మీడియాలో పాటించాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రత, ఉద్యోగులకు, మహిళా కార్మికులకు అవసరమైన ట్రాఫిక్ నియమాలు, మాదక ద్రవ్యాల ముప్పు, డ్రగ్స్ వాడకం వలన కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలు యువత, ఉద్యోగులు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు పోలీసు శాఖ చేపడుతున్న మహిళా భద్రతా చర్యలను అభినందిస్తూ, తమ హక్కులు మరియు రక్షణ నిబంధనలపై విలువైన అవగాహన పొందారు.

# సింహాచలంలో భక్తుని అపూర్వ దాతృత్వం

శ్రీ సింహాద్రినాథ శాశ్వత నిత్యఅన్నప్రసాద నిధికి లక్షా పదహారు విరాళం



**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 27 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల దాతృత్వ పరంపర కొనసాగుతోంది. భక్తులు స్వామివారి సేవలో భాగమవుతూ, ముఖ్యంగా నిత్యాన్నదానం వంటి మహాదాతృత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ భక్తి, సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడకు చెందిన పేతల రామకృష్ణ, నూకరత్నం స్వామివారి శాశ్వత నిత్యఅన్నప్రసాద నిధికి రూ. లక్ష ,16లు విరాళం అందజేసి ఒక నిలకడైన సేవా సంప్రదాయానికి మరొక అధ్యాయం జోడించారు. దంపతులు స్వయంగా సింహాచలం దేవస్థానం ప్రోటోకాల్ కార్యాలయంలోని విరాళ కౌంటర్ వద్ద నగదు రూపంలో విరాళాన్ని సమర్పించారు. దేవస్థాన అధికారులు అందుకున్న మొత్తానికి అనుగుణంగా రసీదు జారీ చేశారు. అనంతరం, దేవస్థానం సీనియర్ సహాయకులు సూర్యనారాయణ బాండ్ దంపతులకు అందజేశారు. విరాళ సమర్పణ అనంతరం దంపతులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించబడింది. వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేస్తూ దాతృత్వ గుణాన్ని ప్రశంసించారు. దేవస్థానం తరఫున దంపతులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

దేవస్థానం అధికారులు మాట్లాడుతూ పేతల రామకృష్ణ, నూకరత్నం దంపతుల దాతృత్వం నిత్యఅన్నప్రసాద పథకాన్ని మరింత బలపరుస్తుంది. ఇలాంటి భక్తుల సేవాభావం స్వామివారి సేవలో ఒక ప్రేరణాత్మక ఆదర్శమని అభినందించారు. దేవస్థానం తరఫున దంపతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపి, భక్తులందరికీ శ్రీ సింహాద్రి నాధుని కటాక్షం చేకూరాలని ఆకాంక్షించారు.

# విజయవాడ పాలకమండలి సభ్యులు కరిగొప్పల పార్వతికి ఘన సత్కారం






**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 :** విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యులు కరిగొప్పల పార్వతి మరియు హుస్సేన్ బాబు విశాఖపట్నం వచ్చిన సందర్భంగా మల్కాపురం జేఏసీ నాయి బ్రాహ్మణ సేవా సంఘం జోనల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘన సత్కారం నిర్వహించారు. మేళతాళాల మధ్య, పరంపరాగత ఆతిథ్యంతో, సంఘ ప్రతినిధులు ఇద్దరు సభ్యులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి అభినందనలు తెలియజేశారు. సత్కార కార్యక్రమంలో మాట్లాడుతూ పాలకమండలి సభ్యురాలు కరిగొప్పల పార్వతి ఆమెకు లభించిన గౌరవానికి హర్షం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఆతిథ్యం అందించిన నాయి బ్రాహ్మణ సంఘానికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ బాధ్యతను నాకు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి ప్రథమంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీరు చూపిన విశ్వాసానికి, చూపిన గౌరవానికి నేను రుణపడి ఉంటాను. భవిష్యత్తులో ఈ బాధ్యతను నెరవేర్చేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని పార్వతి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ముసిడిపల్లి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ గోల్కొండ కరుణాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పూలేటుకుర్తి సూర్యారావు, జోనల్ అధ్యక్షులు గోల్కొండ రామకృష్ణ, ఉపాధ్యక్షులు సాంబశివరావు, తుంపాల శంకర్రావు, సహాయ కార్యదర్శి రేజేటి ఆర్.కృష్ణ తదితరులు హాజరై అభినందనలు తెలిపారు. సంఘ ప్రతినిధుల సమక్షంలో సత్కారం సందడి వాతావరణంలో సాగగా, దేవస్థానం పాలకమండలి సభ్యుల పర్యటనకు స్థానికులు కూడా మంచి స్పందన వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో వైసీపీ పునరుదయం స్పష్టంగా కనిపిస్తోంది




మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 27 :** దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వ్యాఖ్యానించారు. భవిష్యత్ పూర్తిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా మలుస్తోందని, ప్రజల్లో వైసీపీపై విశ్వాసం మరింత బలపడుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఇప్పుడే ఎన్నికలు జరిగితే రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ సంచలనాత్మక విజయాన్ని నమోదు చేయగలదని అన్నారు. 27వ వార్డు అధ్యక్షుడు సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల నాయకులను వార్డు, బూత్ కమిటీల్లో చేర్చిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వాసుపల్లి గణేష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి తమ స్వప్రయోజనాల దిశగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ప్రజలకు చేయిందేమీ లేదని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే శక్తి వైసీపీకే ఉందని గణేష్ కుమార్ స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలలో వైసీపీ భారీ మెజారిటీతో గెలిచి మరోసారి సంచలనం సృష్టిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, పార్టీ కోసం నిబద్ధతతో శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు.

# 87వ వార్డులో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ లైన్ త్వరగా పూర్తి చేయాలని వినతి

**కూర్మన్నపాలెం : పెన్ పవర్ ,నవంబర్ 27**

జీవీఎంసీ 87 వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో జీవీఎంసీ, జోన్-6, కమీషనర్ ,

ఏ.డీ. ఇ ఏ పీ ఇ పి డీ సీ యల్ ను కలసి 87వ వార్డులో జరుగుచున్న అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ లైన్ వర్క్ వడ్లపూడి మెయిన్ రోడ్డులో జరుగుతుంది. ఈ పనివలన మెయిన్ రోడ్డులో నివాసము వున్న వారికి దుమ్మి, ధూళి వలన ప్రజలు, వ్యాపారస్థులు అలాగే ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉందని చాలా ఇబ్బందులు పడుచున్నారు, తక్షణము విద్యుత్ అండర్ గ్రౌండ్ వర్క్ త్వరతగతిన పూర్తిచేయాలనీ జోనల్ కమీషనర్ , ఏ. డీ. ఈ ఎలక్ట్రికల్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వై సి పి నాయకులు తెలిపారు . ఈ కార్యక్రమం లో 87వ వార్డు వైస్సార్సీపీ ప్రెసిడెంట్ బి . గోవింద్ , వెంకటరమణ, శ్రీనివాసరావు, దామోదర్ రావు, దానప్పలు, రాము, సత్తిబాబు,తదితరులు పాల్గొన్నారు.



# కోదండ రామాలయంలో బుర్రా ప్రత్యేక పూజలు





**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 27**

లింగసముద్రం మండలం శింగరపాలెం గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయన వెంట లింగసముద్రం మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్లు రెడ్డి, ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య,రావలకొల్లు బ్రహ్మానందం,గణేశం గంగిరెడ్డి, తలపనేని గోపి, కాపులూరి మధుసూదన్, కాలేషా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో చికిత్స పొందుతున్న టిడిపి నాయకుడు మల్లారెడ్డి ని పరామర్శించిన ముత్తుముల క్రిష్ణ కిశోర్




**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 27**

గిద్దలూరు పట్టణములో డి జిఆర్ వైద్యశాలలో కోమరోలు మండలం బాధినేని పల్లె కుచెందిన టిడిపి నాయకుడు ముత్తుముల యల్లారెడ్డి తండ్రి మల్లారెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి వైద్యశాలకు వెల్లి పరామర్శించి డాక్టర్ " బిజ్జాల విరాట్ రెడ్డి ని అడిగి అనారోగ్యం సమస్య గురించి అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి , సంగాని ప్రతాప్ రెడ్డి, అనిల్ , హర్షవర్ధన్ తదితరులు పరమర్శిశించారు.

# వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గపుచర్య

**మాజీ ఎంపీపీ నరసింహారావు**



**పొదిలి, పెన్ పవర్, నవంబర్ 27**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గపు చర్యగా పొదిలి మాజీ ఎంపీపీ కే నరసింహారావు విమర్శించారు. మెడికల్ కళాశాలలో ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం దారాదత్తం చేస్తున్నందుకు నిరసనగా వైఎస్సార్సీపీ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా గురువారం నాడు మండలంలోని కంబాలపాడు గ్రామంలో సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలను తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే యత్నాలను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ అనంతరం మాజీ ఎంపీపీ నరసింహారావు అందుకు సంబంధించిన పత్రాలను వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నరసింహరావుతోపాటు వైఎస్ఆర్సిపి నాయకులు నారాయణరెడ్డి, జగన్, ఆర్ వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లూరు మండలంలో ప్రజాదర్బార్

**:బిపిసిఎల్ పరిశ్రమకు సంబంధించి భూసేకరణపై రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే ఇంటూరి**

**:భూములిచ్చిన రైతులకు అన్యాయం జరగదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే**

**:చిన్నచిన్న భూవివాదాలు పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచన**





**గుడ్లూరు పెన్ పవర్, నవంబర్ 27**

మండలంలో త్వరలో ఏర్పాటు కాబోతున్న బిపిసిఎల్ పరిశ్రమకు సంబంధించి భూసేకరణ విషయమై రావూరు గ్రామంలోని సచివాలయంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తో పాటు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 15 లక్షలు రూపాయలు చొప్పున గత ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చిందని, ప్రభుత్వంతో తాను మాట్లాడి ఆ మొత్తాన్ని 20 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. పెద్ద పెద్ద పరిశ్రమలు ఏర్పాటు కావడం వల్ల వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని , అలాంటి సందర్భాల్లో రైతులు కూడా పెద్దమనసుతో ఆలోచించి సహకరించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తిచేశారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు. గతంలో పూర్వీకులు కేవలం అగ్రిమెంట్లు మీద భూములు కొనుగోలు చేశారని, అలాంటి భూములకు నష్టపరిహారం అందించే విషయంలో సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. అయితే ప్రస్తుతం ఆ భూమిలో ఎవరు ఉన్నారన్న దానిపై అధికారులు సర్వే చేసి, రైతులకు నష్టపరిహారం త్వరగా అందించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే అర్జీల రూపంలో తెలియజేస్తే, ఆ సమస్యలు పరిష్కారం చేయడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్డిసి రాజశేఖర్, గుడ్లూరు మండల తహసిల్దార్ ఎస్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ముఖ్య నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# గిద్దలూరు తాలూకా ఎన్జీవోల సంఘం ఉపాధ్యక్షుడిగా చిలక శ్రీనివాసులు.

**శ్రీనివాసులకు అభినందనలు తెలిపి చిరు సన్మానం చేసిన కొమరోలు గ్రామ సచివాలయాల సిబ్బంది.**

**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 27**

గిద్దలూరు తాలూకా (గిద్దలూరు, కొమరోలు ,రాచర్ల మండలాలు) స్థాయి ఎన్జీవోల సంఘం ఉపాధ్యక్షులుగా కొమరోలు గ్రామ సచివాలయం 3లో వెల్ఫేర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న చిలక శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గిద్దలూరులో నిర్వహించిన తాలూకా స్థాయి ఎన్జీవోల సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ కార్యవర్గంలో కొమరోలులోని గ్రామ సచివాలయం 3 లో వెల్ఫేర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న శ్రీనివాసులను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం కొమరోలు లోని గ్రామ సచివాలయాల ప్రాంగణంలో కొమరోలు గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవరశెట్టి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో శ్రీనివాసులకు చిరు సన్మాన కార్యక్రమం నిర్వహించారు .ఆ కార్యక్రమంలో కొమరోలు 2,3 గ్రామ సచివాలయాల కార్యదర్శి ఓ ఆర్ జనార్ధన్ రెడ్డి తోపాటు మూడు గ్రామ సచివాలయాల సిబ్బంది శ్రీనివాసులుకు అభినందనలు తెలిపి సన్మానించారు. ఆ మేరకు శ్రీనివాసులు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బ్రహ్మయ్యకు, గ్రామ సచివాలయాల కార్యదర్శి జనార్ధన్ రెడ్డికి, మూడు గ్రామ సచివాలయాల సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. .



# రాజుపాలెంలో గ్రామసభ



**త్రిపురాంతకం పెన్ పవర్ నవంబర్ 27**

గ్రామాల్లో భూ సమస్యలకు ప్రభుత్వ పథకాలకు ఇతరత్రా సమస్యలకు పరిష్కారమే స్వామిత్వ పథకం ఎంపీడీవో రాజకుమార్ గురువారం నాడు మండలంలోని త్రిపురాంతకం మండలం లో రాజుపాలెం గ్రామ సచివాలయంలోనందు నిర్వహించిన స్వామిత్వ గ్రామసభ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్ కుమార్ మాట్లాడుతూ సర్వే చేసిన వివరాలను కొలతలు, పేర్లు, హద్దులు, విస్తీర్ణం ప్రజలకు తెలియజేయడం, వాటిని సరి చూసుకోవడం. స్వామిత్వ సర్వే: డ్రోన్ ద్వారా సర్వే చేసి, పొజిషన్ మ్యాప్‌లు మరియు డేటా తయారు చేయడం జరిగింది. ఇందులో ఒక ఇంచు కూడా పొరపాటు లేకుండా ఖాళీ స్థలాలు, ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు అన్నీ రికార్డు చేశారు.

**రికార్డు ధృవీకరణ:** మీ కొలతలు, పేర్లు, ఇతర వివరాలు సరైనవి అయితే అనెక్జర్-2 లో సంతకం చేయాలి. కొలతల్లో తేడాలు లేదా అభ్యంతరాలు ఉంటే అనెక్జర్-3 లో సంతకం చేయాలి. అభ్యంతరాల పరిష్కారం: అభ్యంతరాలు తెలిపిన వారి ఇంటికి మళ్లీ వెళ్లి కొలతలు వేయడం, మార్పులు ఉంటే చేయడం జరుగుతుంది. ప్రాపర్టీ కార్డులు: సరి చేసిన డేటా ఆధారంగా డిసెంబర్ మొదటి వారంలో ప్రాపర్టీ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రాపర్టీ కార్డుల ప్రయోజనం:** ఈ కార్డులు మీ ఆస్తిపై హక్కు కల్పిస్తాయి. అలాగే, బ్యాంకుల ద్వారా రుణాలు (లోన్లు) తీసుకునేందుకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తాయి. డేటా లాకింగ్: అన్ని వివరాలు సరిచేసి, అందరూ అంగీకరించిన తర్వాత ఈ ఫైల్‌ను కమిషనర్ కార్యాలయానికి పంపించి లాక్ చేస్తారు. ఆ తర్వాత మార్పులు చేయాలంటే జాయింట్ కలెక్టర్ లాగిన్ ద్వారానే సాధ్యమవుతుంది. ఉపాధి హామీ వేతనదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలి. లేకపోతే వారికి వేతనం అందదు, సోక్‌పిట్‌లు, హౌసింగ్ వంటి లబ్ధి కూడా అందే అవకాశం ఉండదు. పన్నుల చెల్లింపు: ఇంటి పన్నును ట్యాక్స్ చేతికి ఇవ్వకుండా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయలపల్లి కృపావతి. సెక్రటరీ కందుల వెంకటేశ్వర రెడ్డి. ఎంపీటీసీ చల్లా ఎల్లారెడ్డి, ప్రసాదు సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# పొగాకు నారు యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం



**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 27**

లింగసముద్రం మండలం లోని మొగిలిచర్ల గ్రామంలో గురువారం పొగాకు నారుమడుల యాజమాన్యం, పొగాకు రైతులు నాట్లు సమయంలో పాటించవలిసిన యాజమాన్య పద్ధతులు గురించి నిర్వహించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కందుకూరు రెండవ వేలం కేంద్రం నిర్వహణాధికారి చంద్ర శేఖర్ మాట్లాడుతూ పొగాకు నారు, పంటపై మాగుడు, నారుకుళ్లు తెగుళ్లు ఆశించకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును 20 గ్రాములు, ప్లాంటామైసిన్ మందును ఒక గ్రాము నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అమిస్టర్ మందును పది మిలీ. పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ రాజా గోపాల్ మాట్లాడుతూ పొగాకు రైతులు అందరూ అంతర్జాతీయ పొగాకు మార్కెట్ ను దృష్టిలో పెట్టుకొని అందరూ మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తూ తక్కువ విస్తీర్ణం లో ఎక్కువ నాణ్యమైన పొగాకు పండించాలి అని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ విజయ్ కుమార్ , జీపీఐ మేనేజర్ సుబ్బా నాయుడు , కార్తీక్ , క్షేత్ర సాంకేతిక సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# వెన్నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పోరెడ్డి

**మార్కాపురం ఆర్.సి ఇన్చార్జి పెన్ పవర్ నవంబర్ 27**

వైయస్సార్ సిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నెంబర్ వెన్న హల్మారెడ్డి పుట్టినరోజు సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సిపి మార్కాపురం మండల అధ్యక్షులు పోరెడ్డి చెంచిరెడ్డి, శివరామపురం సర్పంచ్ గురుబ్రహ్మం స్థానిక ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో ఆయనను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# జనవరి 14న వాడపల్లి కోనసీమ తిరుమలలో గోదాదేవి-రంగనాయకుల కళ్యాణ వైభోగం

**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 27:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిచెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రంలో ప్రతి సంవత్సరం భోగి పండుగ రోజున నిర్వహించే గోదాదేవి-రంగనాయకుల కళ్యాణ మహోత్సవం,2026 జనవరి 14న అతి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.ఈ కళ్యాణోత్సవానికి పాల్గొంటే పెళ్లి కాని యువకులు, పెళ్లి కాని యువతులకు శుభ ఫలితాలు కలుగుతాయని, వివాహయోగం త్వరగా కలుగుతుందని శాస్త్రోక్త నమ్మకం ప్రజల్లో బలంగా నెలకొని ఉంది. అందువల్ల ప్రతి సంవత్సరం వేలాది మంది యువత, యువకులు, వారి కుటుంబాలతో కలిసి ఈ వేడుకలో పాల్గొంటారు.

ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పుష్పాలంకరణ, వేదపండితుల మంగళ వాద్యాలు, శాస్త్రోక్త కర్మకాండల మధ్య స్వామివారి సాక్షిగా గోదాదేవి-రంగనాయకుల కళ్యాణం అత్యంత ఘనంగా జరుగనుంది.ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ,భోగి పర్వదినం రోజున జరిగే గోదాదేవి-రంగనాయకుల కళ్యాణంలో పాల్గొంటే శ్రీమాలక్ష్మీవారి అనుగ్రహం కలుగుతుందని, వివాహయోగం త్వరగానే ఏర్పడుతుందని భక్తుల్లో ప్రగాఢమైన విశ్వాసం ఉంది.



అందుకే ప్రతి భక్తుడు ఈ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కటాక్షం పొందాలని కోరుతున్నాం" అని తెలిపారు.

తేదీ దగ్గరపడుతున్నకొద్దీ వాడపల్లి క్షేత్రంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలియజేశారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మండల యుటిఎఫ్ శాఖ చేయూత






**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్27:**ఆత్రేయపురం గ్రామంలోని ఎం.పి.పి.పి.ఎస్ చినపేట ప్రాంతంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పమ్మి శాంతకుమారి తాటాకిల్లు పూర్తిగా కాలిపోయి దగ్ధమైంది. కుటుంబం ఆర్ధికంగా తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారికి అండగా నిలుస్తూ మండల యుటిఎఫ్ శాఖ ముందుకు వచ్చింది.మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు పి. త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. జ్యోతి బసు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి జీవనావసరమైన సహాయక సామాగ్రిని అందజేశారు. యుటిఎఫ్ లక్ష్యాలలో భాగమైన సామాజిక స్పృహను ప్రతిబింబిస్తూ, బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వంటసామాగ్రి, దుప్పట్లు తదితరంగా రూ. 2,500 విలువ చేసే సరుకులను యుటిఎఫ్ మండల శాఖ అందించింది.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. జ్యోతి బసు, ఎఫ్.డబ్ల్యూ.ఎస్ డైరెక్టర్ ఎస్.వి.వి.ఎన్.ఎస్ ప్రసాద్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు టి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. సుధాకర్ బాబు, కోశాధికారి కదలి ప్రసాద్, అలాగే ఆఫీస్ బ్యారర్లు కందుల గోవిందరావు, చిప్పాడ సత్యనారాయణ, సబ్బెల్ల సత్యనారాయణ రెడ్డి, కొండేపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 27:**మండల పరిధిలోని సంధిపూడి గ్రామంలో సర్పంచ్ తోట భవానీ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో నూతన సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఎనర్జీఎస్ నిధుల ద్వారా రూ.43.60 లక్షలు వ్యయంతో నూతన సచివాలయ భవనం నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామంలోని ప్రజలు, రైతులు, సచివాలయం సేవలను వినియోగించుకోవాలన్నారు. అలాగే సచివాలయం అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి,గ్రామ టిడిపి అధ్యక్షుడు సూరపురెడ్డి పట్టాభి రామయ్య, ఎంపిటిసి సభ్యురాలు తోలేటి సంతోషి, ప్రముఖ వ్యాపారవేత్త వట్టికూటి సతీష్, పినపళ్ళ సర్పంచ్ సంగిత సుభాష్,సొసైటి అధ్యక్షులు వంటిపల్లి సతీష్,నల్లా వెంకన్న, కొత్తపల్లి నగేష్,ఈదల నల్లబాబు, వైట్ల గంగరాజు,ఈదల రాంబాబు, మానేపల్లి శ్రీనివాస్, రామానుజుల శేషగిరిరావు, ముప్పరి వెర్రియ్య, వాసా కాశీ,పామర్తి ఆంజనేయులు, అంగర ఏసు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మొయ్యటి నారాయణ



**ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 27 :**ప్రత్తిపాడు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మొయ్యటి నారాయణ నియమితులయ్యారు. నియోజక వర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో జరిగిన పార్టీ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు అలీ మేది, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం. సూర్యప్రకాశ్‌రావు లు నారాయణకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నూతన అధ్యక్షుడు కృషి చేయాలని సూచించారు. యువతను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు చేపట్టాలని, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి పార్టీ తీసుకుంటున్న చర్యలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఎంపికైన మొయ్యటి నారాయణను పిసిసి సభ్యుడు ధర్నాలకోట శ్రీను, మండల అధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కొల్లు వీరగణేష్, నాగం బుల్లి వెంకన్నదొర, భీమరాజులు తదితరులు అభినందించారు.

# ఆదివాసి కొండరెడ్లసంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం

కొండరెడ్లసంఘం చింతూరుడివిజన్,అధ్యక్షులు ముర్లకనకారెడ్డి



**వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్.27** మండలంలోని జీడిగుప్ప గ్రామంలోగురువారం కనుగల చిన్న శ్రీనివాస్ రెడ్డి,అధ్యక్షతనలోఆదివాసికొండరెడ్ల సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈసందర్భంగా ఆదివాసికొండరెడ్ల సంఘం చింతూరు డివిజన్ అధ్యక్షులు ముర్ల కనకారెడ్డి మాట్లాడుతూ పోలవరంనుజిల్లాగా రంపచోడవరంను కేంద్రంగాఏర్పాటు చేసినందుకు కొండరెడ్ల,గిరిజనుల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలుతెలిపారు. చింతూరు డివిజన్,పరిధిలోని ఉన్న ఐ.టి.డి.ఏ.ప్రాజెక్టు కార్యాలయంలోసంబంధితఅధికారులుద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా చూడాలని, ఐ.టి.డి.ఏ.కార్యాలయాలో పి.వి.టి.జి.కొండరెడ్లతెగకు సంబందించిన గిరిజనులకుప్రత్యేక నిధులు కేటాయించి ఆర్థికంగాసహాయం సహకారంఅందించాని,గిరిజనులకు తొంబైశాతం సబ్సిడీ యూనిట్స్ మంజూరు చేయాలని, విద్య,వైద్యం,ఉద్యోగ ఉపాధిలో మొదటి ప్రాధాన్యత గిరిజనులకుకల్పించాలని,ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలోముర్లజగపతి రెడ్డి,కెచ్చల సూరపరెడ్డి, కనుగులరవీంద్రారెడ్డి,వల్ల గణపతి రెడ్డి, కనుగుల శ్యామల వెంకట్ రెడ్డి,అందెల శ్రీరామ్,మూర్తిరెడ్డి,ముర్ల చిరంజీవి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఏడువారాల వెంకన్న నిత్య అన్నప్రసాదానికి లక్ష విరాళం

వాడపల్లి క్షేత్రంలో వైభవంగా విశిష్ట పూజలు





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్27:**కోనసీమ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభను చాటుతున్న వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం విశిష్ట పూజా కార్యక్రమాలు ఎంతో భక్తి, శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఏడు వారాల నోములు నోసుకునే భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వసంత మండపంలో అష్టోత్తర శతనామ పూజ, నిత్య కళ్యాణం, హారతీ సేవలు అర్చకులు అతి వైభవంగా నిర్వహించారు. వేకువజామున ప్రారంభమైన కార్యక్రమాలు మధ్యాహ్నం వరకు కొనసాగి, భక్తులను ఆధ్యాత్మిక ఆనందంతో నింపాయి.వందలాది మంది భక్తులు స్వామివారి సన్నిధికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం "గోవింద%ా% గోవింద%ా%" నినాదాలతో మార్మోగింది.స్వామివారి నిత్య అన్నదానాన్ని మరింతగా బలోపేతం చేయాలనే సంకల్పంతో హైదరాబాద్, ఎస్.ఆర్.నగర్‌కు చెందిన ఆవాల వెంకట సుబ్బారావు కుటుంబం సభ్యులు చి. ఆవాల శ్రీ వీర వెంకట లక్ష్మి,
ఇషాన్వి ం 1,00,116 రూ విరాళం అందించారు.ఈ సందర్భంగా ఆలయ పండితులు వేద మంత్రోత్సవాలతో కుటుంబ సభ్యులను ఘనంగా ఆశీర్వదించారు. అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

# ఆకట్టుకున్న అభి నృత్య ప్రదర్శన



**రాజమహేంద్రవరం,పెన్ పవర్ నవంబర్ 27:**సీతానగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో కూచిపూడి నాట్య అద్భుతమైన ప్రదర్శన చేసి అభి తన ప్రతిభను నిరూపిం చుకుందని, హిందూ ధర్మ రక్షక సమితి నాయకులు ఆకుల మణి కాంత్ తెలిపారు చిన్నతనం నుండే తన తల్లి దండ్రుల అభిరుచి మేరకు , గురువ ర్యులు శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షేత్రం నిర్వహికురాలు కళా తపశ్వి తణుకు సాయి మాదవి శిక్షణలో జాతీయ స్థాయిలో జరిగిన కూచిపూడి పోటిల్లో అభి తన ప్రతిభను నిరూ పించుకుంది. అభి గృహంలో తను సాధించిన మెమోంటోలు , సరిఫికెట్లు , మెడల్స్ స్వాగతం పలుకుతుంటాయి . పలువురు కితాబులతో అభిని అభినందించారు. తన నాట్య ప్రతిభ సాయి మాదవి కృషికి తార్కాణమని అభిని చెప్పటం విశేషం. నగర కేద్రంగా శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షేత్రం నిర్వహించడం అభిని కూచిపూడి నాట్యంలో పూర్తి స్థాయిలో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు సి హెచ్ వెంకట్ , భవానీ లను పలువురు గురువులు అభినందించారు.

అభి హిందూ ధర్మానికి ప్రతీకగా కూచిపూడి నాట్యం పట్ల ఆకర్షింపబడటం చిన్నతనం నుండి పిల్లల్లో హిందూ ధర్మ విలువలను, కూచిపూడి నాట్యం గొప్పతనాన్ని తెలియచేసే విధంగా పాఠశాలలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని. శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షత్రాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని ఇప్పటికే శ్రీమతి సాయి మాదవి సారథ్యంలో జాతీయ స్థాయిలోను, రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక పోటిల్లో గోల్డ్ మెడల్స్ , ప్రతిష్టాత్మకమైన మెమోంటోలు , సర్టిఫికెట్స్ సాధించిన ఖ్యాతి సాయి మాదవి సొంతం అభి తో పాటుగా ఎంతో మంది కూచిపూడి విద్యార్థులు ఈ కళా క్షేత్రంలో వారే కావడం ఎంతో గర్వంగా వుందని ప్రముఖులు సాయి మాదవి కృషిని ప్రశంసించారు.

# కల్యాణ మండపానికి భూమి పూజ

కొత్తపేట నియోజకవర్గం జనసేన ఇన్చార్ బండారు శ్రీనివాస్..



**ఆలమూరు,పెన్ పవర్, నవంబర్ 27:**ఆలమూరు మండలంలోని సంధిపూడి గ్రామంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్యాణ మండపానికి కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ గురువారం భూమి పూజ చేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారంతో త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆకాక్షించారు. జనసేన మండల అధ్యక్షులు సురపరెడ్డి సత్య, చింతలూరు సొసైటీ అధ్యక్షులు నల్ల వెంకన్న, సర్పంచ్ లు తోట భవానీ వెంకటేశ్వర్లు,సంగిత సుభాష్, ఎంపీటీసీ తోలేటి సంతోషి, నల్లా వెంకన్న, సలాది రామకృష్ణ, తమ్మన భాస్కరరావు, గారపాటి త్రిమూర్తులు, చల్ల బాబి, దాసరి వీర పండు, కట్టా రాజు, కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## క్రిమి సమహారక మందులు వాడకం తగ్గించాలి

* ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం, పెన్ పవర్, నవంబర్ 27.** క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా వాడడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని అసెంబ్లీ బడ్జెట్ ఎస్టిమేట్ కమిటీ సభ్యులు, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్ రాజు అన్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా గురువారం విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురుగు మందులు వాడినటువంటి ఆకు కూరగాయలు చిన్నపిల్లలు తినడం వల్ల ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. చిన్నపిల్లల శరీరంకు రోగాలను తట్టుకునే శక్తి ఉండదన్నారు. అలాగే బియ్యం ను మెరుగుపట్టి మరీ సన్నగా చేయడం వల్ల పైన ఉండే పొర మొత్తం పోయి వాటిలో ఏ రకమైన పోషకాలు ఉండవన్నారు. అన్ని రకాల ప్రజలకు ఆరోగ్యాన్ని చేకూర్చే విధంగా పంటలు పండించవలసి ఉందన్నారు. అయితే ఇందుకు సంబంధించి అధికారులు నివేదన తయారు చేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళవచ్చు అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ద్రాక్షారామంలో హుండీ లెక్కింపు - 43 రోజుల్లో రూ.43.95 లక్షల ఆదాయం



**రామచంద్రపురం/ద్రాక్షారామం, పెన్ పవర్,నవంబర్ 27:**శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈరోజు హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్ 15, 2025 నుండి నవంబర్ 27, 2025 వరకు 43 రోజుల వ్యవధిలో ఆలయ హుండీల ద్వారా రూ.43,95,359 ఆదాయం లభించినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని మీడియాకు తెలిపారు. అలాగే అన్నదాన హుండీ ద్వారా రూ.52,682 వచ్చినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి. సత్యనారాయణ పర్యవేక్షించారు. అలాగే ఓదురు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణా ధికారి విత్తనాల శ్రీనివాస్, గంగవరం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి వి. బాలకృష్ణ, అర్చకులు, ద్రాక్షారామ పోలీస్ శాఖ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది, సేవా సిబ్బంది, భక్తులతో పాటు ముప్పనపల్లి గణేష్, పెంకే సాంబశివ, ఆళ్ల బుజ్జి, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ, నవీన్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధర్మవరంలో పీవీసీ పైపుల తయారీ యూనిట్‌కు ముదునూరి మురళీకృష్ణం రాజు శుభారంభం





**ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 27 :**ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో పాండురంగ పీవీసీ పైపుల తయారీ ఇండస్ట్రీని నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు, వైసీపీ నేత ముదునూరి మురళీ కృష్ణం రాజు ప్రారంభించారు. జాతీయ రహదారి సమీపంలో దాట్ల రంగరాజు స్థాపించిన ఈ కొత్త యూనిట్ ప్రారంభోత్సవానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, భీమవరం ఎంపిపి పేరిచర్ల నరసింహరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలను ప్రారంభించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో పివిసి పైపుల తయారీ చేస్తోన్న పాండురంగ యూనిట్ మంచి వృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దెందుకూరి రామకృష్ణ రాజు, దాట్ల వంశీ రాజు, దాట్ల రోహిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చుకల పరిరక్షణకు ధాన్యపు కుంచెలు

## ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేయాలన్న హరిత వికాస్ ఫౌండేషన్




**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 27:** జిల్లాలోని ప్రతి విద్యార్థికి స్వయంగా ధాన్యం కుంచె తయారీ నేర్పించి పిచ్చుకల పరిరక్షణ ఉద్యమంలో వారిని భాగస్వాములను చేయాలని కోరుతూ, తునికి చెందిన హరిత వికాస్ ఫౌండేషన్ ఫౌండర్, విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు పి. దాలినాయుడు గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.పిచ్చుకల సంరక్షణకు హరిత వికాస్ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాల వివరాలను ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆయన వివరించారు.పర్యావరణం, జీవ వైవిధ్యం పట్ల చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో మంచి అవగాహన పెంపొందించడం ద్వారా బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. జీవ వైవిధ్యానికి, రైతులకు పిచ్చుకలు మరియు ఇతర పక్షులు అందించే ప్రయోజనాలను వివరించిన దాలినాయుడు మాష్టారు, పంటలకు హాని చేసే అనేక పురుగులను పక్షులు తినడం ద్వారా రైతులు పెద్ద మట్టుకు లాభపడుతారని చెప్పారు. పక్షులు విసర్జించిన విత్తనాల వల్ల కోట్లాది మొక్కలు సహజంగా పెరుగుతాయని పేర్కొన్నారు.వరికుంచెలు తయారీ ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధిలభిస్తుందని, ఒక ఎకరం పొలంలో ఏడాదికి ధాన్యం కుంచెలు తయారు చేసి అమ్మితే లక్ష రూపాయలకుపైగా ఆదాయం వస్తుందని చెప్పారు. ఉపాధి లేని కాలంలో మహిళలు నెలకి రూ.10,000 నుండి రూ.15,000 వరకు సంపాదించుకోవచ్చు అన్నారు. నిరుద్యోగ యువతకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా అవకాశాలు లభిస్తాయని వివరించారు.

రాబోయే మార్చి 20 ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ధాన్యం కుంచెలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ,హరిత వికాస్ ఫౌండేషన్ స్థాపకుడు పోలుపర్తి దాలినాయుడు మాష్టారు కలెక్టర్ షణ్మోహన్ కి వినతిపత్రం అందజేశారు.

## వేదిరేశ్వరం జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు





**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు27:**వేదిరేశ్వరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.మురళీకృష్ణ మాట్లాడుతూ 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదించబడిందని,అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు,సౌకర్యాలు కల్పించేలా రాజ్యాంగ రూపకల్పన చేసిన మహానుభావుడని తెలిపారు.సైన్స్ ఉపాధ్యాయులు సర్వా రాయుడు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా భారత ప్రజలందరికీ రాజ్యాంగ హక్కులు కల్పించారని,ఆ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొన్నారు.స్కూల్ చైర్మన్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధికి అంబేద్కర్ అమూల్యమైన సేవలు చేసారని, ఆర్టికల్ 14, 15, 16, 39%జ%, 42 వంటి రాజ్యాంగ అంశాల్లో మహిళా హక్కులకు ప్రత్యేక స్థానం కల్పించారని వివరించారు.విద్యార్థులు హృదయాకారంలో కూర్చోవడం ఎంతో ఆకర్షణీయంగా ఉందని,నేటి బాలికలు రేపటి సమాజ నిర్మాణకర్తలని చెప్పారు.తదుపరి ఫస్ట్ అసిస్టెంట్ ఎస్.రాంప్రసాద్ రాజ్యాంగ పీఠికను చదివి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కె.ఈశ్వర్ రెడ్డి, పి.ఇ.టి వై.ప్రసాద్, విశ్వనాథం, సాయి, సీతామహాలక్ష్మి, సుజిత, ప్రసన్న కుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## సంధిపూడిలో కాపు కల్యాణ మండపం పనులకు భూమిపూజ



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 27:**మండలంలోని సంధిపూడి గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపం నిర్మాణానికి గురువారం కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు,గ్రామస్తులు సహకారంతో మండపం నిర్మాణం పూర్తి చేసి నిరుపేదలు కల్యాణం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి,గ్రామ టిడిపి అధ్యక్షుడు సూరపురెడ్డి పట్టాభి రామయ్య, ప్రముఖ వ్యాపారవేత్త వట్టికూటి సతీష్, పినపళ్ళ సర్పంచ్ సంగిత సుభాష్,సొసైటి అధ్యక్షులు వంటిపల్లి సతీష్,నల్లా వెంకన్న, కొత్తపల్లి నగేష్,ఈదల నల్లబాబు, వైట్ల గంగరాజు,ఈదల రాంబాబు, మానేనల్లి శ్రీనివాస్, రామానుజుల శేషగిరిరావు, ముప్పరి వెర్రియ్య, వాసా కాశీ,పామర్తి ఆంజనేయులు, అంగర ఏసు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఫక్రుద్దీన్ పాలెంలో ‘రైతన్న-మీకోసం’ కార్యక్రమం: పంచసూత్రాలతో సాగు చేయాలని రైతులకు సూచనలు





**కాకినాడ, పెన్ పవర్ నవంబర్ 27:**జిల్లాలో జరుగుతున్న రైతన్న - మీకోసం కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు పిఠాపురం మండలం ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయకుమార్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయానికి ఇస్తున్న ప్రాముఖ్యతను వివరించి, ముఖ్యమంత్రి లేఖను రైతులకు అందజేశారు.రైతులు పంచసూత్రాలను అమలు చేస్తూ సాగులో ముందుకు సాగాలని జేడీ విజయ్ కుమార్ సూచించారు. నీటి భద్రత, మార్కెట్ గిరాకీ ఆధారంగా పంటల ఎంపిక, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగం, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రాధాన్యం, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు వంటి అంశాలను ఆయన స్పష్టంగా వివరించారు. వ్యవసాయం లాభసాటిగా మారేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్ పాలెం గ్రామ పంచాయతి అధ్యక్షుడు శేఖర్, పిఠాపురం ఏడీ స్వాతి, మండల వ్యవసాయ అధికారి గంగాధర్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భాగ్యరేఖ, రైతులు పాల్గొన్నారు.

## 1962 మొబైల్ వెటర్నరీ సేవలు ఎంతో కీలకం

### ప్రభుత్వ ఐదు సూత్రాలు ప్రతి రైతు తెలుసుకోవాలని అదనపు డైరెక్టర్ డా. రాజని కుమారి



**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 27:** రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలు ప్రతి రైతు తెలిసి సద్వినియోగం చేసుకోవాలని అదనపు డైరెక్టర్ (హెల్త్) డా. ఎన్. రాజని కుమారి పిలుపునిచ్చారు. గురువారం ఆమె జాయింట్ డైరెక్టర్ డా. కృష్ణమూర్తి, డెప్యూటీ డైరెక్టర్ డా. అంబేద్కర్లతో కలిసి కాకినాడ అర్బన్ 1962 మొబైల్ వెటర్నరీ అంబ్యులేటరీ యూనిట్ను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ రాష్ట్ర స్థూల విలువ జోడింపులో కీలక పాత్ర పోషిస్తుందని, పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తి పెంపుతో పాడి రైతులకు అభివృద్ధి దిశగా కొత్త అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పశువుల ఆరోగ్య రక్షణలో 1962 మొబైల్ వెటర్నరీ సేవలు ఎంతో ముఖ్యమని, ఇవి రైతులకు సమయానుకూలంగా సేవలు అందిస్తూ ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పశువైద్య సేవలను సమర్థ వంతంగా అందిస్తున్న 1962 అంబులెన్స్ బృందాన్ని అధికారులు అభినందించారు. ఈ సందర్శనలో భాగంగా డా. బాల సువర్ణ, పారావెట్ బాలయోగి, పైలట్ శ్రీను (కాకినాడ అర్బన్)లను వారి అంకితభావ సేవలకు గాను సన్మానించారు.

# జగనన్న ప్రభల తీర్థానికి గుర్తింపు

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

ఆంధ్రప్రదేశ్‌లో జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమ్మతి తెలిపారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాల్లో.. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఉత్సవానికి రాష్ట్ర పండుగగా ప్రకటిస్తే.. కోనసీమ ప్రాంత ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుంది. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలలో జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ప్రత్యేక స్థానం ఉంది. వందల ఏళ్లుగా తెలుగు సంస్కృతికి చిహ్నంగా ఈ పండుగ నిలుస్తోంది. అయితే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబు సమ్మతించారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ మేరకు మలికిపురం గ్రామానికి వచ్చిన ఆయనకు స్థానికులు వినతిపత్రం అందించారు. స్థానికుల వినతిపై స్పందించిన మంత్రి దుర్గేష్.. లక్షల మంది భక్తుల కోలాహలం మధ్య ప్రతి సంవత్సరం వైభవంగా నిర్వహించే ఈ ప్రభల తీర్థానికి 450 సంవత్సరాల ఘనచరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ విషయంపై ఇప్పటికే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీనికి సీఎం చంద్రబాబు కూడా సమ్మతి తెలిపారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ఏటా సంక్రాంతి పర్వదినాల్లో.. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తారు. పంట కాలువల సవ్వడి నడుమ సంక్రాంతి కనుమ రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. దాదాపు 450 ఏళ్లు చరిత్ర కలిగిన ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని ప్రజలు ఎప్పటినుంచో ఆకాంక్షిస్తున్నారు. దేశం మొత్తంలో.. ఏకాదశరుద్రులు ఒకేచోట కొలువుతీరేది జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలోనే. రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన ప్రభలు అంబాజీపేట మండలంలోనే తయారు చేస్తారు. ఈ జగ్గన్నతోట ప్రభల ఉత్సవం విశిష్టత గురించి గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు రాసిన లేఖల ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ తెలుసుకున్నారు. అనంతరం ప్రధాని 2020లో తన సందేశాన్ని పంపించారు. 2023లో ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకలో జగ్గన్నతోట ప్రభల తీర్థం శకటాన్ని ప్రదర్శించారు. ఈ ప్రభల గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం. ఈ ఏడాది పర్యాటకశాఖ ఈవెంట్స్–ఫెస్టివల్ వెబ్‌సైట్‌లో ఈ ఉత్సవం చోటు దక్కించుకోవడం గమనార్హం. అంతేకాకుండా పదోతరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో.. జగ్గన్నతోట ప్రభల తీర్థం ప్రాధాన్యత, ప్రాచుర్యాన్ని వివరించారు. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్రపండుగగా గుర్తిస్తే.. కోనసీమ ప్రాంతం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు దక్కుతుంది. పర్యాటకులు కూడా ఎక్కువ సంఖ్యలో రావడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇక రాష్ట్ర పండుగగా గుర్తిస్తే.. ఈ ఉత్సవం మరింత వైభవంగా జరపడానికి.. ఉత్సవానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. అంతేకాకుండా పదకొండు గ్రామాల్లో కొలువుదీరిన ఏకాదశ రుద్రుల ఆలయాలు మరింత అభివృద్ధి చెందుతాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు.. ఆలయాల వద్ద ప్రధానంగా తాగునీరు, వైద్యశిబిరాలు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయొచ్చు.

# తుపాన్‌గా బలపడిన సెన్యార్ తీవ్రవాయుగుండం..

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక, హిందూ మహాసముద్రం మీదుగా అల్పపీడనం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర– వాయువ్య దిశగా కదులుతూ తీవ్రఅల్పపీడనంగా మారే అవకాశం ఉందంది. ఆ తదుపరి 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వివరించింది. మలక్కా జలసంధి ప్రాంతంలో సెన్యార్ తుపాన్ గా బలపడిన తీవ్రవాయుగుండం. ఈ తుపానుకు 'సెన్యార్'గా నామకరణం చేశారు. 24 గంటల తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. విశాఖపట్నం, కొనసీమ, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో 5 నుంచి 10 సెం.మీ. వర్షపాతం నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. తమిళనాడులో పలు జిల్లాలకు అలర్ట్ ప్రకటించారు. మలక్కా జలసంధి ప్రాంతాల్లో తీవ్రవాయుగుండం కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ–వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ ఈరోజు తుపానుగా బలపడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఇది పశ్చిమ–వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని హెచ్చరించింది. అల్పపీడనం, తుపాను ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు (నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2) కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరి కోతలు జోరుగా సాగుతున్న క్రమంలో వెంటనే కుప్పలు వేసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ సూచించింది. పండిన ధాన్యాన్ని తడవకుండా భద్రపరచుకోవాలని, తడిసిన గింజలు మొలకెత్తకుండా, నాణ్యత కోల్పోకుండా జాగ్రత్త పడాలి సూచించింది. రంగుమారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలని అన్నదాతలకు సూచించింది.

# పార్లమెంటుకు అమరావతి బిల్లు...

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

అమ రావతి రైతుల చిరకాల వాంఛ తీరనుంది. ఏపీ ప్రజల్లో ఉన్న అయోమయం తొలగనుంది. ఏపీకి అమరావతి శాశ్వత రాజధానిగా కేంద్రం గుర్తించనుంది. ఈ మేరకు డిసెంబర్ లో పార్లమెంటులో అమరావతి రాజధానిగా చట్టం చేయనున్నారు. చట్టబద్ధత కల్పించనున్నారు. గత అనుభవాల దృష్ట్యా భవిష్యత్తులో మరోసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చట్టబద్ధత కల్పించాలన్నది చాలా ఏళ్లుగా వినిపిస్తూ వస్తోంది. ఇప్పుడు ఏపీలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉండడం.. ఆపై కేంద్రంలో కీలక భాగస్వామి కావడంతో అమరావతికి చట్టబద్ధత అనేది సులువు అవుతోంది. దేశంలో ఏ రాష్ట్ర రాజధాని కీ లేని అరుదైన గౌరవం, ఆపై ఏకంగా చట్ట 'భద్రత' దొరకనుంది. నవ్యాంధ్రప్రదేశ్ కు టిడిపి తొలి ప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది. అయితే అటు తరువాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కారణాలతో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఆ సమయంలో మంత్రి బొత్స లాంటి సీనియర్ నేత కూడా అమరావతికి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదని.. అందుకే అమరావతిని మారుస్తున్నట్లు ప్రకటన చేశారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం సైతం ఈ విషయంలో కలుగజేసుకోలేదు. రాష్ట్రాల రాజధానుల ఏర్పాటు అనేది ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని.. అందులో కలుగజేసుకోలేమని ప్రకటించింది. టిడిపి తో బిజెపికి ఉన్న విభేదాలతోనే అలా ప్రకటన చేసిందని అంతా భావించారు. అయితే చాలా సందర్భాల్లో అమరావతిని రాజధానిగా కేంద్రం గుర్తించిందన్న ప్రకటన వచ్చేది అప్పట్లో. అంతకుమించి స్పాంతన ఉండేది కాదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి రాజధాని నిర్మాణ పనులు పున ప్రారంభం అయ్యాయి. కానీ అమరావతి పై అనుమానపు ఛాయలు అలానే ఉండిపోయాయి. జగన్ లాంటి మరో నేత వచ్చి అమరావతి కాదని వేరే రాజధాని ప్రకటిస్తారన్న అనుమానాలు కూడా ఉండిపోయాయి ప్రజల్లో. అందుకే ప్రజల్లో ఉన్న అయోమయాన్ని పోగొట్టాలని సిఆర్డిఏ అధికారులు కేంద్రాన్ని ఆశ్రయించారు. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని.. పార్లమెంటులో చర్చించి ఆమోదించాలని అటార్నీ జనరల్ వెంకటరమణను కోరారు. అయితే దేశంలో ఏ రాజధానికి కూడా గెజిట్ నోటిఫికేషన్ అనేది ఇవ్వలేదని.. అలా ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం లేదని.. అది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంపై ఆధారపడి ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. అమరావతి విషయంలో చట్టబద్ధత కల్పించకపోతే వచ్చే ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లింది. ప్రజల్లో ఉన్న అయోమయం తొలగించడంతో పాటు భారీగా పెట్టుబడులు వస్తున్న దృష్ట్యా ఇన్వెస్టర్స్ లో నమ్మకం కోసమైనా అమరావతికి చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందని ఏపీ నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై అటార్నీ జనరల్ సైతం సంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక నోటు తయారు చేసి.. కేంద్ర క్యాబినెట్ కు పంపించారు. అక్కడ ఆమోదముద్ర వేసి న్యాయ శాఖకు వెళ్ళింది ఆ నోటు. అక్కడ కూడా అనేక రకాల అభ్యంతరాలు అధిగమించి ప్రస్తుతం హోం శాఖ పరిధిలో ఉంది. డిసెంబర్ లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అమరావతి బిల్లు చర్చకు రానుంది. తప్పనిసరిగా చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. నిజంగా ఇది అమరావతికి శుభపరిణామమే.

# టమోటా ధరలకు రెక్కలు

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



టమోటా ధరలకు రెక్కలు వచ్చాయి. ఉన్న పళంగా బంగారం లాగానే ధరలు పెరుగుతున్నాయి. మదనపల్లి మార్కెట్ లో కిలో రూ. 63 టమోటా ధర తలుకుతుండగా గత పది రోజులుగా క్రమేణ పెరుగుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని పడమటి మండలాల్లో ప్రధాన ఆదాయ పంటగా టమోటా సాగు చేస్తున్న రైతులు ధర ఉన్న దిగుబడి లేక దిగాలు చెందుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మదనపల్లి,తంబళ్లపల్లి పుంగనూరు పలమనేరు నియోజకవర్గాల్లోనే దాదాపు 10 వేల హెక్టార్లలో టమోటా సాగు చేసిన రైతులు దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉంటుందని భావించారు. సీజన్ ముగుస్తున్న సమయంలో మొంథా తుఫాను, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దిగుబడి తగ్గింది. వర్షాల వల్ల చీడ పురుగులతో తెగుళ్ల బెడద రైతులకు ఇబ్బందిగా మారడంతో పాటు దిగుబడి కూడా తగ్గేందుకు కారణమైంది. వర్షాల కారణంగా తేమశాతం అధికం కావడం, టమోటా మచ్చలు ఏర్పడడంతో పాటు పొలాల్లోనే కుళ్ళిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో దిగుబడిపై ప్రభావం పడటం వల్ల మదనపల్లి మార్కెట్ కు దిగుబడి తగ్గింది. గతేడాది ఇదే సమయంలో రోజు సగటున దాదాపు 700 మెట్రిక్ టన్నుల టమోటా మదనపల్లి మార్కెట్ కు రాగా ప్రస్తుతం 150 మెట్రిక్ టన్నులకు దిగుబడి పడిపోయింది. మదనపల్లి సరిహద్దున ఉండే కర్ణాటక ప్రాంతంలోని కోలారు, చింతామణి, ముల్బాగల్ ప్రాంతాల నుంచి కూడా ఆశించిన మేర మదనపల్లి మార్కెట్ కు టమోటా దిగుబడి కాకపోవడంతో ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. తగ్గట్టుగా మదనపల్లి మార్కెట్ లో టమోటా అందుబాటులో లేకపోవడం, మరోవైపు టమోటా కొనుగోలుకు బయట నుంచి ట్రేడర్లు కూడా ఆసక్తి చూపుతున్నడంతో మదనపల్లి మార్కెట్లో టమోటా కు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలోనే గత 10 రోజుల క్రితం రూ.10 పలికిన కిలో టమోటాధర ఇప్పుడు ఏకంగా రూ. 60 కు పైగానే ఉంటోంది. మోంథా తోపాటు వరుసతుఫానుల ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కారణంగా టమోటా ధరలు పెరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తగ్గిన దిగుబడి తో నిన్న మదనపల్లి మార్కెట్ కు వచ్చిన 140 మెట్రిక్ టన్నుల టమోటా రాగా మొదటి రకం కిలో టమోటా ధర రూ. 52 నుంచి రూ.63 వరకు పలుకగా రెండో రకం ధర రూ. 33 నుంచి 50 లు దాకా పలికింది. దీంతో ధరలు ఆశాజనకంగా ఉన్న దిగుబడి టమోటా సాగు చేసిన రైతులను పెరుగుతున్న ధరలు ఊరించని పరిస్థితి నెలకొంది.

# పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్లాన్

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇంటర్మీడియట్ బోర్డు 'సంకల్ప్–2026' కార్యక్రమాన్ని చేపట్టింది. 50 రోజుల ప్రణాళికతో కూడిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్ బాషా విడుదల చేశారు. నవంబరు 24 నుంచి ఫిబ్రవరి 20 వరకు ఈ ప్రణాళిక అమలు చేయనున్నారు. సంకల్ప్ ప్రణాళిక ప్రకారం.. రోజూ ఉదయం 9.10 నుంచి 12.40 గంటల వరకు అన్ని సబ్జెక్టుల్లో బోధించని అంశాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రివిజన్, ఇతర టెస్ట్‌లు విద్యార్థులకు నిర్వహించాలి. డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు స్పెషల్ క్లాసులు ఉంటాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జూనియర్ కాలేజీల్లో ఈ ప్రణాళికను అమలు చేయాలని ఇంటర్ బోర్డు సూచించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026 మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు విద్యాశాఖ ఇటీవల షెడ్యూలు కూడా విడుదల చేసింది. షెడ్యూలు ప్రకారం పరీక్షలకు వంద రోజులు సమయం ఉంది. ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక, అక్కడ ఉన్న వసతులపై విద్యాశాఖాధికారులు పరిశీలన చేశారు. అవసరమైన చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈసారి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు గతంలో కన్నా ఈ ఏడాది నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రతీరోజు తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి చదువుకోవాలి. ఏ సబ్జెక్టు అయినా రెండు లేదా మూడు భాగాలుగా విభజించుకోవాలి. పరీక్ష గడువు కాలాన్ని బట్టి కొంత సమయం రివిజన్‌కు కేటాయించి, మిగిలిన వాటిని పాఠ్యాంశాలు చదవడానికి కేటాయించాలి. రోజూ 20 నిమిషాల పాటు ధ్యానం చేయాలి. గత పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు చదివి సాధన చేయాలి. చదివిన ప్రశ్నలను చూడకుండా రాయాలి. వేగంగా రాసే విధానం అలవాటు చేసుకోవాలి. బిట్‌పేపరుపై నిర్లక్ష్యం వదిలి క్షుణ్ణంగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులతో చర్చిస్తూ అనుమానాలు నివృత్తి చేసుకోవాలి.. ఈ మేరకు కార్యచరణతో వంద రోజుల ప్రణాళికను అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని అధికారులు సూచించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

# చేతికొస్తున్నపంటలకు దక్కని మద్దతు ధరలు

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పంట చేతికి వచ్చిన ప్రతీ సారి ఇబ్బంది పడుతున్నారు. మొదట తోతాపురి మామిడి కాయలకు డిమాండ్ లేక ఆందోళన చెందారు. తర్వాత ఉల్లి పంట పరిస్థితి అదే. ఇప్పుడు అరటి పంటలకూ డిమాండ్ ఉండటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో తోతాపురి మామిడి రైతులు ధరలు పడిపోవడంతో రూ.1,000 కోట్ల నష్టం చవిచూశారు. సెప్టెంబర్‌లో ఉల్లి ధరలు పడిపోయి, కర్నూల్, కడప జిల్లాల్లో రైతులు పంటను పారబోశారు. ఇప్పుడు అరటి పంటలకూ అదే పరిస్థితి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 18 ముఖ్య ఆహార పంటల్లో మామిడి, ఉల్లి, అరటి ప్రధానమైనవి. 2024–25లో మామిడి పంటలు అధిక ఉత్పత్తి ధర తగ్గుబాటు కారణంగా రైతులు భారీ నష్టం చవిచూశారు. ప్రభుత్వం కొంత సాయం చేసింది. సెప్టెంబర్‌లో ఉల్లి రైతులకు అదే సమస్య వచ్చింది. ఇప్పుడు అరటి రైతులు గగ్గోలు పెడుతున్నారు. డిమాండ్ , ఎగుమతులు తగ్గడం, లోకల్ మార్కెట్ స్థిరత్వం లేకపోవడం వల్ల ధర పడిపోయాయి. 2025లో ఆంధ్రలో హార్టికల్చర్ పంటలు 30 శాతం పెరిగింది. కానీ మద్దతు ధర విధానం సరిగ్గా లేకపోవడం వల్ల రైతులు లాభాలు పొందలేకపోతున్నారు. ఫలితంగా, రైతుల ఆదాయం 40 శాతం తగ్గిందని చెబుతున్నారు. సెప్టెంబర్ 2025లో ధరల పతనంతో రూ.50,000/ హెక్టారుకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. – 24,000 మంది రైతులు ప్రయోజనం పొందారు. నవంబర్ 2025లో మార్కెట్ ధరలు మెరుగుపడ్డాయి. జూలై 2025లో కేంద్రం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ఆమోదించి తోతాపురి రైతులకు రూ.1,490 క్వింటాల్ మద్దతు ధర నిర్ణయించింది. రాష్ట్రం రూ.4 కేజీ సబ్సిడీ మొత్తం రూ.260 కోట్లు ఇచ్చింది. అక్టోబర్ 2025లో రూ.172.84 కోట్లు 37,881 మంది రైతుల అకౌంట్లలో జమ చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రైతులు ప్రధానంగా ప్రయోజనం పొందారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతు పథకాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంబించడం వంటి చర్యలు ప్రకటించింది. అరటి పంటలకు %మీరా% ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామనిప్రకటించారు. కానీ, ఇదంతా పేపర్ల మీదనే ఉన్నాయని రైతుల వరకూ వెళ్లడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతుంది. ఇన్‌పుట్ సబ్సిడీలు, కోల్డ్ స్టోరేజ్ సమస్యలు ఉండటంతో రైతులు మధ్యవర్తుల చేతిలో మోసపోతున్నారు. 2025లో హార్టికల్చర్ పంటలకు 1500 కోట్లు బడ్జెట్ కేటాయించినప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో అమలు జరగడం లేదు. పంటలు అనూహ్యంగా ఎక్కువగా పండటం వల్ల ఇతర చోట్ల డిమాండ్ తగ్గిపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం ఎంత సాయం చేసినా రైతులు మాత్రం నష్టపోతూనే ఉన్నారు.

# టీడీపీలో పంచాయితీలు

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

తెలుగుదేశం పార్టీకి ఈసారి ఏంటో కానీ అధినాయకుడు ఒకవైపు లాగుతుంటే.. ఎమ్మెల్యేలు మరొక వైపు లాగుతున్నారు. ముఖ్యంగా ఈ టర్మ్ లో మాత్రం టీడీపీని దారుణంగా నష్టపరుస్తుంది ఖచ్చితంగా ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే. ఎందుకంటే గతంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావు. తమ నియోజకవర్గంలో ఏదైనా సమస్యలున్నా అధినాయకత్వంతో చెప్పుకునే వారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. నాయకత్వం మాట పెడచెవిన పెట్టి తాము అనుకున్నది మీడియా ముందు చెప్పేస్తున్నారు. దీంతో టీడీపీకి భారీగా డ్యామేజీ అవుతుంది. తాజాగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరద రాజులు రెడ్డి కూడా అలాంటి కోవలోకి వెళ్లినట్లే కనిపిస్తుంది. అసలే రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుందని వైసీపీ చేస్తున్న విమర్శలకు వరదరాజులు రెడ్డి వంత పాడినట్లుంది.. ప్రొద్దుటూరులో బంగారం వ్యాపారాలకు కొదవలేదు. బంగారం దుకాణాలు లెక్కకు మించి ఉన్నాయి. అయితే బంగారం వ్యాపారులను బెదరించి పోలీసులు ప్రయివేటు పంచాయతీలు చేస్తున్నారని సాక్షాత్తూ ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి పోలీసులపై ఫైర్ అవ్వడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. రాజకీయం కోసం బంగారం వ్యాపారులకు అండగా ఉండటంలో తప్పులేదు. కానీ అదే సమయంలో ప్రభుత్వంలో ఉన్న సమయంలో పోలీసులపై నెగిటివ్ కామెంట్స్ చేయడం ఇప్పుడు హాట్ హాట్ గా మారింది. బంగారు వ్యాపారి శ్రీనివాసులును అన్యాయంగా అరెస్ట్ చేశారని, ఏడు కోట్ల రూపాయల అప్పు వసూళ్లలో పోలీసులు ప్రమేయం ఉందని వరద రాజులు రెడ్డి చెప్పారు తమ విధులను మానేసి ప్రయివేటు పంచాయతీలు చేయడం, సివిల్స్ తగాదాల్లో తలదూర్చడమేంటని అధికార పార్టీ ఎమ్మెల్యేనే ప్రశ్నించడం ఇప్పుడు వైసీపీకి కలసి వచ్చింది. పోలీసుల వ్యవహార శైలిని టీడీపీ ఎమ్మెల్యేలే తప్పుపడుతున్నారంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. ఇక వైసీపీ సంగతి పక్కన పెడితే అసలు అధికారంలో ఉన్నప్పుడు ఏదైనా జరిగితే అది ఉన్నతాధికారుల దృష్టికో, జిల్లా ఇన్ ఛార్జి మంత్రికో చెప్పి పరిష్కరించుకోవాలని, లేకుంటే హైకమాండ్ ను సంప్రదించాలని, అంతేకాని ఇలా మీడియా సమావేశాలు పెట్టి పోలీసుల తీరును విమర్శించడం కేవలం హోం మంత్రిత్వ శాఖకు మాత్రమే కాదు...చంద్రబాబు సర్కార్ పైన కూడా పడుతుందన్నది ఈ పెద్దాయనకు తెలియదా? అంటే తెలుసు. ఎందుకు తెలియదు. అయినా అన్నారంటే డోన్ కేర్ అన్నమాటేగా.

# దీప్తి శర్మకు జాక్ పాట్.. గంటలోనే నలుగురు స్టార్ ప్లేయర్స్‌ను కొనేసిన యూపీ వారియర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్-2026 సీజన్ మెగా వేలం గురువారం (నవంబర్ 27) ఢిల్లీలో ప్రారంభమైంది. మెగా ఆక్షన్ కావడంతో స్టార్ ప్లేయర్స్ పై భారీ హైప్ నెలకొంది. మొత్తం 277 మంది ప్లేయర్స్ మెగా ఆక్షన్ లోకి వచ్చారు. ఇందులో 73 స్థానాల కోసం ప్లేయర్స్ పోటీ పడనున్నారు. 194 మంది భారత ప్లేయర్స్ ఉన్నారు. వీరిలో 52 మంది క్యాప్?డ్ ప్లేయర్స్ ఉండగా, 142 మంది అన్ క్యాప్?డ్ ప్లేయర్స్ ఉన్నారు. డబ్ల్యూపీఎల్ జట్లు ముంబై, బెంగుళూర్, గుజరాత్, ఢిల్లీ, యూపీ ఐదు ఫ్రాంచైజీలు తమ జట్టును పటిష్టం చేసుకోవడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటివరకు జరిగిన ఈ మెగా ఆక్షన్ లో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మకు భారీ ధర లభించింది. యూపీ వారియర్స్ ఈ ఆల్ రౌండర్ ను రూ. 3.2 కోట్లకు కొనుగోలు చేసింది. మెగా ఆక్షన్ కు ముందు ఉమెన్స్ వరల్డ్ కప్‌లో ఆల్‌రౌండ్ షో చూపెట్టిన దీప్తి శర్మకు విమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో నిరాశ ఎదురైంది. ఆమెను యూపీ వారియర్స్ రిటేన్ చేసుకోలేదు. మెగా టోర్నీలో దీప్తి 215 రన్స్, 22 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచింది. అలాగే గతేడాది డబ్ల్యూపీఎల్‌లోనూ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచినా ఫ్రాంచైజీ ఆమెపై కరుణ చూపలేదు. అయితే ప్రస్తుతం జరుగుతున్న మెగా ఆక్షన్ లో అదే జట్టు ఈ యూపీ ఆల్ రౌండర్ ను భారీ ధరకు కొనుగోలు చేయడం విశేషం. న్యూజిలాండ్ యంగ్ ఆల్ రౌండర్ అమేలియా కెర్ ను ముంబై ఇండియన్స్ రూ. 3 కోట్ల ధరకు సొంతం చేసుకుంది. కెర్ ను కూడా ముంబై రిలీజ్ చేసి ప్రస్తుతం జరుగుతున్న మెగా ఆక్షన్ లో భారీ ధరకు తీసుకుంది. ఇటీవలే బిగ్ బాష్ లీగ్ లో మెరుపు సెంచరీ చేసిన మెగ్ లానింగ్ ను 1.9 కోట్లకు యూపీ వారియర్స్ దక్కించుకుంది. కెప్టెన్ గా లానింగ్ వరుసగా మూడేళ్లు ఢిల్లీ జట్టును ఫైనల్ కు తీసుకెళ్లినా ఆమెను ఢిల్లీ రిలీజ్ చేసింది. భారత స్పిన్నర్ శ్రీ చరనికి మంచి ధర లభించింది. రూ. 1.3 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ ఈ ఆఫ్ స్పిన్నర్ ను దక్కించుకుంది.

సీనియర్ ప్లేయర్, గత సీజన్ లో ఆర్సీబీ జట్టుకు ఆడిన సోఫీ డివైన్ ను రూ. 2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ కొనుగోలు చేసింది. ఇంగ్లాండ్ స్టార్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ ను కూడా యూపీ వారియర్స్ దక్కించుకోవడం విశేషం. ఆస్ట్రేలియా ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ ను కూడా యూపీ వారియర్స్ దక్కించుకుంది. వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియాపై సెంచరీ కొట్టిన ఈ ఆసీస్ ఓపెనర్ ను రూ.1.2 కోట్లకు కొనుగోలు చేసింది.

# అప్పటివరకు హెడ్ కోచ్‌ను మార్చే ఆలోచన లేదు: గంభీర్‌కు బీసీసీఐ సపోర్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** స్వదేశంలో సౌతాఫ్రికాపై రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను టీమిండియా 0-2 తేడాతో కోల్పోయిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గంభీర్ భారత కోచ్ గా జట్టులోకి రావడంతోనే పరాజయాలు ఎక్కువయ్యాయని తీవ్రంగా తమ నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గౌహతి వేదికగా బుధవారం (నవంబర్ 26) జరిగిన రెండో టెస్టులో సౌతాఫ్రికా చేతిలో టీమిండియా 408 పరుగుల తేడాతో ఘోరంగా ఓడిపోవడంతో టీమిండియా టెస్ట్ భవిష్యత్ డైలమాలో పడింది. దీంతో గంభీర్ ను భారత జట్టు కోచ్ గా తొలగించాలనే డిమాండ్స్ వినిపించాయి. గంభీర్ కూడా తన భవిష్యత్ ను బీసీసీఐ నిర్ణయిస్తుందని షాకింగ్ కామెంట్స్ చేశాడు. తన పదవీకాలంలో సాధించిన విజయాలనూ గుర్తు పెట్టుకోవాలన్నాడు. గంభీర్ కామెంట్స్ పై బీసీసీఐ స్పందించింది. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ వైట్ వాష్ తర్వాత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌ను తొలగించే ప్రతిపాదనను తోసిపుచ్చింది. జట్టు పరివర్తన దశలో ఉన్నందున బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోవడానికి తొందరపడదని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. సెలెక్టర్లు, జట్టు మేనేజ్‌మెంట్‌తో బోర్డు చర్చలు జరుపుతుందని గంభీర్ ను తొలగించే ఆలోచన లేదని బీసీసీఐ అధికారి అన్నారు. బీసీసీఐ అధికారి మాట్లాడుతూ ఇలా అన్నారు.. "గంభీర్ విషయంలో బీసీసీఐ ఎటువంటి నిర్ణయం తీసుకోవడంలో తొందరపడదు. జట్టు పరివర్తన దశలో ఉంది. ప్రపంచ కప్ దగ్గర పడుతున్నందున ఇప్పుడు కోచ్ ను మార్చే ఉద్దేశ్యం లేదు. గంభీర్ తో ఒప్పందం 2027 ప్రపంచ కప్ వరకు ఉంది. ఆ తర్వాతే అతనిపై నిర్ణయం తీసుకుంటాం. సెలెక్టర్లు, జట్టు మేనేజ్‌మెంట్‌తో బీసీసీఐ మాట్లాడుతుంది". అని బీసీసీఐ అధికారి తెలిపారు.

**సిరీస్ ఓటమి తర్వాత గంభీర్ కామెంట్స్:**

"నా విషయంలో బీసీసీఐ నిర్ణయం తీసుకోవాలి. ఇండియా క్రికెట్ ముఖ్యం, నేను కాదని కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నప్పుడే చెప్పా. ఇప్పుడు కూడా అదే మాట చెబుతున్నా. ప్రజలు విజయాలను చాలా త్వరగా మర్చిపోతారు. ఎందుకంటే ఇంగ్లండ్‌లో యువ జట్టుతో ఫలితాలు సాధించిన వ్యక్తిని నేనేనన్న విషయం మర్చిపోయి కివీస్ చేతిలో వైట్‌వాష్‌ను గుర్తు పెట్టుకున్నారు. నేను చాంపియన్స్, ఆసియా ట్రోఫీని కూడా గెలిచిన వ్యక్తిని". అని గౌతీ గుర్తు చేశాడు.

**టెస్టుల్లో గంభీర్ కు బ్యాడ్ రికార్డ్:**

టీమిండియా హెడ్ కోచ్ గా గౌతమ్ గంభీర్ అడుగుపెట్టినప్పటి దగ్గర నుంచి భారత జట్టు టెస్టుల్లో విజయాల కోసం తీవ్రంగా శ్రమిస్తోంది. వైట్ బాల్ ఫార్మాట్ లో అదరగొట్టిన టెస్టుల్లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోతుంది. తాజాగా సౌతాఫ్రికాతో ముగిసిన రెండో టెస్టులో ఓటమి తర్వాత గంభీర్ పై విమర్శలు ఎక్కువయ్యాయి. ఇప్పటివరకు గంభీర్ కోచ్ గా భారత జట్టు ఆరు టెస్ట్ సిరీస్ లు ఆడింది. వీటిలో రెండు గెలిచి మూడు ఓడిపోయింది. ఇంగ్లాండ్ తో జరిగిన సిరీస్ సమమైంది. గెలిచిన రెండు సిరీస్ లు కూడా బలహీనమైన బంగ్లాదేశ్, వెస్టిండీస్ లపై కావడంతో గంభీర్ హెడ్ కోచ్ గా ఇప్పటివరకు విఫలమయ్యాడనే చెప్పాలి.

# డబ్ల్యూపీఎల్ వేలం: రూ.1.30 కోట్లు పలికిన తెలుగమ్మాయి శ్రీ చరణి




**హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ప్రీమియర్ లీగ్ 2026 మెగా వేలంలో తెలుగు తేజం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ స్పిన్నర్ శ్రీ చరణి సంచలనం సృష్టించింది. ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రూ. 1.30 కోట్లకు కొనుగోలు చేసింది. ఇది డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఆమెకు లభించిన అత్యధిక ధర కావడం విశేషం.గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఈ వేలంలో శ్రీ చరణి కోసం ఫ్రాంచైజీలు తీవ్రంగా పోటీ పడ్డాయి. ఆమె బేస్ ప్రైస్ రూ. 30 లక్షలు కాగా, ఢిల్లీ క్యాపిటల్స్, యూపీ వారియర్స్ మధ్య హోరాహోరీ బిడ్డింగ్ జరిగింది. చివరికి ఢిల్లీ ఆమెను దక్కించుకుంది. గత సీజన్‌లోనూ ఢిల్లీ తరఫున ఆడిన ఆమె, కేవలం రెండు మ్యాచ్‌లలో 4 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇదే ఆమె ధర భారీగా పెరగడానికి కారణమైంది.కడప జిల్లాకు చెందిన 21 ఏళ్ల శ్రీ చరణి ఇటీవల భారత జట్టు తరఫున వరల్డ్ కప్ టోర్నీలో 9 మ్యాచ్‌లలో 14 వికెట్లు పడగొట్టింది. కీలకమైన సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లలో ఆమె తన పొదుపైన బౌలింగ్ తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించింది. మరోవైపు, ఈ వేలంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమీలియా కెర్‌ను ముంబై ఇండియన్స్ రూ. 3 కోట్లకు కొనుగోలు చేయగా, సోఫీ డివైన్‌ను గుజరాత్ జెయింట్స్ రూ. 2 కోట్లకు సొంతం చేసుకుంది. అయితే, ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ అలిస్సా హీలీ తొలి రౌండ్‌లో అమ్ముడుపోకపోవడం ఆశ్చర్యం కలిగించింది.

# 'దంగల్' రికార్డులను టార్గెట్ చేసారా?

భారతీయ చిత్ర పరిశ్రమలో భారీ వసూళ్లు సాధించిన చిత్రమేది? అంటే అందరికీ గుర్తొచ్చేది %-%దంగల్%-%. అమీర్ ఖాన్ ప్రధాన పాత్రలో నితీష్ తివారీ తెరకెక్కించిన చిత్రం ఏకంగా 2000 కోట్ల వసూళ్లతో సరికొత్త రికార్డు సృష్టించింది. అదీ ఒకే భాగంగా రిలీజ్ అయి అన్ని కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇండియాలో వసూళ్ల కంటే? చైనా మార్కెట్ నుంచే 1300 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఇండియన్ మార్కెట్ నుంచి సాధించింది కేవలం 700 కోట్లు మాత్రమే. రెజ్లింగ్ నేథ్యంలో తెరకెక్కిన సినిమా కావడంతో చైనా ప్రేక్షకులు ఆ చిత్రానికి బ్రహ్మరథం పట్టారు.

**రికార్డులు తిరగ రాసేలా:**

ఇండియన్ బాక్సాపీస్ లెక్కల పరంగా చూస్తే %-%బాహుబలి%-, -%పుష్ప%-% లాంటి చిత్రాలు భారీ వసూళ్లు సాధించిన చిత్రాలుగా కనిపిస్తున్నాయి. వాటి సంగతి పక్కన బెడితే? 2000 కోట్ల రికార్డును తిరగరాసేది మళ్లీ నితీష్ తివారీనేనా అంటే? అవుననే అనాలి. ప్రస్తుతం రణబీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో ఇతిహాసం




%-%రామాయణాన్ని%-% రెండు భాగాలు గా తివారీ తెరకెక్కిస్తోన్న సంగి తెలిసిందే. ఈ సినిమా వందల కోట్లలో ఉంది. ఇప్పటికే మొదటి భాగం రామాయణం షూటింగ్ పూర్తయింది. వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా తొలి భాగం రిలీజ్ కానుంది.


**హాలీవుడ్ లో భారతీయ కథలు:**

మొదటి భాగానికి సంబంధించి పోస్ట్ ప్రడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ కథ కూడా విజువల్ ట్రీట్ గా హైలైట్ అవుతుందని నితీష్ చెప్పుకొచ్చాడు. రెండు సంవత్సరాల కష్టం రిలీజ్ అవుతుందని..తనకి కూడా లోలోపల టెన్షన్ ఉందన్నాడు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ స్టామినా ఎంత? 2000 కోట్ల వసూళ్లు రాబట్టే సత్తా ఉందా? అంటే అందుకు అవకాశాలు కనిసిస్తున్నాయి. %-%రామాయణం%-% అంటే భారత్ లోనే కాదు ప్రపంచ దేశాల్లోనూ ఎంతే క్రేజ్ ఉంది. భారతీయ చారిత్రాత్మక అంశాలను ఆధారంగా చేసుకునే హాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తున్నారు.

**మోదీ పర్యటనలు కలిసొచ్చేలా:**

అవతార్ కథలకు స్పూర్తి భారతీయ పుస్తకాలే. భాగవతం, మహాభారతం వంటి వాటికి ప్రపంచ దేశాల్లో ఎంతోప్రత్యే కత ఉంది. అందులోనూ రాముడు..సీత.. అంజనేయుడు.. లంకేశ్వరుడు కథ అంటే? ఎంతో ఆసక్తిగానూ ఉంటుంది. ఆ కథకు విజువల్ ట్రీట్ ఇస్తోన్న చిత్రం కావడంతో? ప్రపంచ దేశాల్లో రామాయణం భారీ ఎత్తున రిలీజ్ ప్లానింగ్ రెడీ అవుతోంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించే దేశాల్లో ప్రత్యేకంగా రిలీజ్ చేయనున్నారు. మోదీ అధికారంలోకి రావడంతో భారతీయ హిందు సంప్రదాయాలు మరింత విశ్వవ్యాప్తమయ్యాయి. అది కూడా ఈ సినిమాకు ప్రధానంగా కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. మరి ఈ అంచనాలను రామాయణం అందుకుంటుందా? లేదా? అన్నది చూడాలి.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com